




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 11 సంచిక : 332 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం బుధవారం 6 ఆగస్టు 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :332 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM WED 6 AUGUST 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


# కొందరికి డబ్బున్నా పేదలను ఆదుకునేందుకు మనసు రాదు

- ఆంధ్రప్రదేశ్‌లో పేదరిక నిర్మూలనకు పీ-4 కార్యక్రమం
- ఈ నెల 19 నుంచి అమలు చేయనున్నట్లు సీఎం వెల్లడి
- పేద కుటుంబాలకు చేయూతనివ్వనున్న 'మార్గదర్శులు'
- తాను 250 కుటుంబాలను దత్తత తీసుకున్నానన్న చంద్రబాబు
- కార్యక్రమంలో బిల్ గేట్స్, వేదాంత వంటి సంస్థల భాగస్వామ్యం

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌లో పేదరిక నిర్మూలనకు చేపట్టిన పీ-4 (పబ్లిక్-ప్రైవేట్-పీపుల్-పార్టనర్‌షిప్) కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. బంగారు కుటుంబాలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే లక్ష్యమని, ఈ కార్యక్రమం ఈ నెల 19 నుంచి అమలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. సచివాలయంలో మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం సమీక్ష నిర్వహించారు.సీఎం మాట్లాడుతూ, మార్గదర్శుల ఎంపికలో ఎవరినీ బలవంతం చేయకుండా స్వచ్ఛందంగా జరగాలని సూచించారు. "మార్గదర్శుల చిన్న సాయం పేదలకు కొండంత అండగా ఉంటుంది. బంగారు కుటుంబాలకు భావోద్వేగ బంధం, చేయూత అవసరం" అని పేర్కొన్నారు. సీఎస్ఆర్ నిధులతో బిల్ గేట్స్, వేదాంత వంటి సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నాయని, ప్రజల ఆస్తిగా 'జీరో పావర్టీ మిషన్' అమలు చేస్తున్నామని చెప్పారు.ఇప్పటివరకు 9,37,913 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు, 1,03,938 మందిని మార్గదర్శులుగా ఎంపిక చేసినట్లు సీఎం తెలిపారు. 10 లక్షల కుటుంబాల అవసరాలను 11 ప్రశ్నల ద్వారా ఏఐ సాయంతో విశ్లేషించగా, 31% మంది ఉద్యోగ అవకాశాలు, 22% మంది వైద్య చికిత్స, 9% మంది చిన్న వ్యాపారాల విస్తరణకు సాయం కోరినట్లు వెల్లడించారు. గ్రామాలు, మండలాల వారీగా దత్తత కార్యక్రమంలో



పాల్గొనేందుకు పలువురు ముందుకొ స్తున్నారని, తాను 250 కుటుంబాలను దత్తత తీసుకు న్నానని, ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చంద్రబాబు వివరించారు.కొందరు మంచి పనులను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తుంటారని అన్నారు. మరికొందరు డబ్బు ఉన్నా పేదలను ఆదు కునేందుకు మనసు రాదని అన్నారు. ఇంకొందరికి మనసు ఉన్నా సేవా కార్యక్రమాలు చేసేందుకు తగిన సమయం ఉండదని చంద్రబాబు పేర్కొన్నారు. అటు వంటి వారిని గుర్తించి మార్గదర్శనం చేయాలని అధికా రులకు సూచించారు. నేడు బంగారు కుటుంబంలో సాయం పొందిన వారే రేపు మార్గదర్శి అవ్వొచ్చని అన్నారు.

## ఏపీ బలంగా పుంజుకుంటోంది... ఈ వసూళ్లే నిదర్శనం

- జూలైలో రికార్డు స్థాయిలో రూ.3,803 కోట్ల జీఎస్టీ వసూళ్లు
- గత ఏడాదితో పోలిస్తే 14 శాతం వృద్ధి నమోదు అని లోకేశ్ వెల్లడి
- దక్షిణాది రాష్ట్రాల్లో ఇదే అత్యధిక వృద్ధి రేటు అని వివరణ



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలంగా పుంజుకుంటోందని, దీనికి నిదర్శనంగా జూలై నెలలో జీఎస్టీ వసూళు సరికొత్త రికార్డు సృష్టించాయని రాష్ట్ర ఐటీ, విద్య, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. మంగళవారం ఆయన సోషల్ మీడియా వేదికగా ఈ వివరాలను వెల్లడించారు. రాష్ట్రంలో 2017లో జీఎస్టీ విధానం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ ఎన్నడూ లేనంతగా 2025 జూలై నెలలో రూ.3,803 కోట్లు వసూలైనట్లు లోకేశ్ పేర్కొన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఇది 14 శాతం అధికమని ఆయన వివరించారు. ఈ వృద్ధి రేటు దక్షిణాది రాష్ట్రాల్లోనే అత్యధికమని, దేశంలోని పెద్ద రాష్ట్రాల్లో మూడో స్థానంలో నిలిచిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. "ఆంధ్రప్రదేశ్ మళ్లీ పుంజుకుంది, ఇది ఆరంభం మాత్రమే" అని ఆయన తన ఎక్స్ ఖాతాలో వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కీలక అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా విజయవాడలో బుధవారం 'ఎంపవరింగ్ ఇండియాస్ గ్రీన్ ఫ్యూచర్' పేరుతో గ్రీన్ స్కిల్లింగ్ సదస్సును నిర్వహించనుంది. దేశంలోనే అతిపెద్ద గ్రీన్ స్కిల్లింగ్ కార్యక్రమంగా దీన్ని అభివర్ణిస్తున్నారు.

ఈ సదస్సు ద్వారా సౌర, పవన విద్యుత్ తయారీ, నిర్వహణ వంటి రంగాల్లో వేలాది మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నారు. స్వనీతి ఇనిషియేటివ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ)

వివరాలు 2లో..

## 24 గంటల్లో భారత్‌పై మరిన్ని సుంకాలు పెంచుతాం

### ట్రంప్ మరోసారి బెదిరింపులు




**పెన్ పవర్ డెస్క్:** ఇప్పటికే భారత దిగుమతులపై 25 శాతం వాణిజ్య సుంకాలు విధించిన ట్రంప్.. ఇండియాకు మరో షాక్ ఇచ్చాడు. భారత్?పై వచ్చే 24 గంటల్లో వాణిజ్య సుంకాలను గణనీయంగా పెంచుతామని బిగ్ బాంబ్ పేల్చాడు. మంగళవారం (ఆగస్ట్ 5) CNBCకి ఇచ్చిన ఇంటర్వ్యూలో రష్యా నుంచి భారత్

వివరాలు 2లో..

## జీవితంలో నేను రెండుసార్లు కంటతడి పెట్టుకున్నా

- తాను అమ్మను చూడలేదన్న వెంకయ్యనాయుడు
- ఉప రాష్ట్రపతి అయినప్పటి నుంచి బీజేపీ కార్యాలయానికి వెళ్లలేదని వెల్లడి
- భాష విషయంలో నాయకులు హుందాగా వ్యవహరించాలని హితవు

వివరాలు 2లో..



## అది భారత్ హక్కు.. వద్దని చెప్పడానికి మీరేవరూ..? ట్రంప్ బెదిరింపులపై రష్యా సీరియస్

- భారత్ పై ట్రంప్ హెచ్చరికల వేళ.. రష్యా కీలక ప్రకటన
- రష్యా నుంచి చమురు కొనుగోలుపై భారత్‌కు ట్రంప్ హెచ్చరిక
- భారీగా సుంకాలు పెంచుతామని వార్నింగ్
- భారత్‌కు మద్దతుగా నిలిచిన రష్యా
- భాగస్వాములను ఎంచుకునే హక్కు ప్రతి దేశానికీ ఉంటుందని స్పష్టీకరణ
- ట్రంప్ ఆరోపణలను తీవ్రంగా ఖండించిన భారత ప్రభుత్వం
- అమెరికా, ఐరోపా దేశాలూ రష్యాతో వ్యాపారం చేస్తున్నాయని వెల్లడి



వివరాలు 2లో..

## ఆర్టికల్ 370 రద్దుకు ఆరేళ్లు.. దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన పవన్ కల్యాణ్

- ఈ నిర్ణయంతో జాతీయ సమగ్రత బలపడిందని వెల్లడి
- కశ్మీర్‌లో ఐక్యత, సమానత్వం పెరిగాయన్న పవన్
- 2019 ఆగస్టు 5న ఆర్టికల్ 370ని రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం
- అభివృద్ధి దిశగా జమ్మూకశ్మీర్, లడఖ్ పయనం

జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక స్వయంప్రతిపత్తిని కల్పించిన ఆర్టికల్ 370ని రద్దు చేసి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ నిర్ణయం దేశ ఐక్యత, సమానత్వాన్ని బలోపేతం

వివరాలు 2లో..



## జగన్ హయాంలోనే రెడ్ బుక్ రాజ్యాంగం నడిచింది

- ప్రజా సంక్షేమాన్ని జగన్ ఏనాడూ పట్టించుకోలేదన్న రామానాయుడు
- సాక్షిలో తనపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపాటు
- టిడ్కో ఇళ్లపై రుణం తీసుకుని జగన్ ప్రభుత్వం దారి మళ్లించిందని ఆరోపణ



**పెన్ పవర్ డెస్క్:**జగన్ హయాంలోనే రెడ్ బుక్ రాజ్యాంగం నడిచిందని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. పాలకొల్లులో ఈరోజు మీడియాతో మాట్లాడుతూ... కక్షలు, అక్రమ కేసులు, దాడులు, విధ్వంస పాలన తప్పితే ప్రజా సంక్షేమాన్ని జగన్ ఏనాడూ పట్టించుకోలేదని మండిపడ్డారు. పాలకొల్లు వైసీపీ నేతలు క్రికెట్ బెట్టింగ్ లో దొరికినా, వారి అక్రమ సంపాదన వెలుగు చూసినా సాక్షి దినపత్రికలో ఎందుకు ప్రచురించలేదని రామానాయుడు ప్రశ్నించారు. తాను బాధ్యతతో పని చేస్తుంటే... సాక్షి దినపత్రికలో కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని

వివరాలు 2లో..

## రూ.17 వేల కోట్ల లోన్ ఫ్రాడ్ కేసు... అనిల్ అంబానీపై ఈడీ ప్రశ్నల వర్షం

- ఈడీ విచారణకు హాజరైన రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ
- యెస్ బ్యాంక్ రుణాల కేసులో గంటల తరబడి విచారణ
- రూ.17,000 కోట్ల నిధుల మళ్లింపు, మోసంపై ప్రధాన ఆరోపణలు
- డొల్ల కంపెనీల ద్వారా నిధులు మళ్లించారా అనే కోణంలో దర్యాప్తు
- ఇటీవల ముంబై, ఢిల్లీ కార్యాలయాల్లో ఈడీ సోదాలు
- సీబీఐ కూడా రంగంలోకి దిగడంతో కేసులో ఉత్కంఠ

వివరాలు 2లో..



## అసలైన భారతీయుడెవరో న్యాయమూర్తులు నిర్ణయించరు

- రాహుల్ గాంధీపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో స్పందన
- ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్ష నాయకుడి విధి అని స్పష్టీకరణ
- తన సోదరుడికి సైన్యం పట్ల అత్యంత గౌరవం ఉందని వెల్లడి
- పార్లమెంటు వద్ద మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేసిన ప్రియాంక



**పెన్ పవర్ డెస్క్:**ఎవరు నిజమైన భారతీయుడో, ఎవరు కాదో న్యాయమూర్తులు నిర్ణయించరని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా స్పష్టం చేశారు. తన సోదరుడు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై సుప్రీంకోర్టు ఇటీవల చేసిన కొన్ని వ్యాఖ్యల నేపథ్యంలో ఆమె మంగళవారం ఈ విధంగా స్పందించారు. పార్లమెంటు వద్ద మీడియాతో మాట్లాడుతూ, న్యాయవ్యవస్థపై తమకు పూర్తి గౌరవం ఉందని, అయితే పౌరుల

వివరాలు 2లో..

## జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ కన్నుమూత

- ఆర్టికల్ 370 రద్దు సమయంలో జమ్మూకశ్మీర్ గవర్నర్‌గా బాధ్యతలు
- బీహార్, గోవా, మేఘాలయ రాష్ట్రాలకు కూడా గవర్నర్‌గా సేవలు
- సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎమ్మెల్యే, ఎంపీ, కేంద్ర మంత్రిగా పదవులు
- రైతు సమస్యలపై ప్రభుత్వ విధానాలను తరచూ విమర్శించిన నేత
- కాంగ్రెస్, జనతాదళ్, బీజేపీ వంటి పలు పార్టీలలో పనిచేసిన అనుభవం

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

# ఆ పథకాన్ని ముట్టుకుంటే ముఖ్యమంత్రి 'మసే'

తెలంగాణ మంత్రివర్గ సమావేశం ముగిసింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ ఇచ్చిన నివేదికపై చర్చించింది. దీనిపై మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు వివరించారు. 2016లో మొదలయిన ప్రాజెక్టులను 2019లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తెచ్చామని కేసీఆర్ చెప్పారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రమాదంలో ప్రాజెక్టు పడిందని అనేక సంస్థలు విచారణ చేసి నివేదికలు ఇచ్చాయని, డిజైన్, ఆపరేషన్, మెయిన్ టెనెన్స్ లో లోపాలున్నాయని గుర్తించాయని తెలిపారు. తాము అధికారంలోకి రాగానే కాళేశ్వరం ప్రాజెక్టుపై కమిషన్ ను నియమించామన్నారు. 14.03.2024 న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ను ఏర్పాటు చేశామని రేవంత్ తెలిపారు.

**అసెంబ్లీ సమావేశాల్లో...**

665 పేజీల కమిషన్ నివేదికను మంత్రివర్గ సమావేశంలో ఆమోదించామన్న రేవంత్ రెడ్డి ఊరు మార్చి, పేరు మార్చి, అక్రమాలకు పాల్పడిన కాళేశ్వరం ప్రాజెక్టు నేడు కూలిపోయిందని, దీనికి బాధ్యులైన ప్రజాప్రతినిధులు, అధికారుల ప్రమేయం పై కమిషన్ నివేదికలో చర్చజరిగిందన్నారు. ఈ కమిషన్ రిపోర్టును అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి అందరి అభిప్రాయాలను తెలుసుకోవాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించామన్నారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత కమిషన్ నివేదికపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ముందుకు వెళుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. శాసనసభ సమావేశాల్లో అందరి అభిప్రాయాలను తెలుసుకుంటామని చెప్పారు.

**పునాదుల్లోనే లోపాలు...**

తొలుత నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టు నివేదికపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీలో చాలా లోపాలున్నాయని ఎన్డీఎస్ఏ చెప్పినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ప్రజాధనం దుర్వినియోగం అయినట్లు పీసీ ఘోష్ కమిషన్ తన నివేదికలో పేర్కొందని అన్నారు. డిజైన్, ప్రాజెక్టు నిర్వహణ, నిర్మాణంలో లోపాలున్నాయని కమిషన్ చెప్పిందన్నారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టుల పునాదుల్లోనే లోపాలున్నాయని తెలిపింది. రుణాలు తీసుకొచ్చే విషయంలోనూ గత ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని చెప్పారు. ప్రజాధనాన్నికాంట్రాక్టరుకు కట్టబెట్టడానికి ప్రాజెక్టు అంచనాలను రివైజ్ చేశారని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ స్పష్టం చేసిందని తెలిపారు. రాజకీయ కక్షలు కాదని, వ్యక్తిగత కక్షలుకు తావివ్వకుండానే కమిషన్ నివేదికను చర్చకు పెట్టడం జరిగిందన్నార.

**అధిక వడ్డీలకు రుణాలను తెచ్చి...**

అధిక వడ్డీలకు ఎనభై నాలుగు వేలకోట్ల రూపాయలను రుణాలుగా తెచ్చారన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును కాళేశ్వరం ప్రాజెక్టుగా మార్చడంలో కేసీఆర్ దే కీలక పాత్ర అని కమిషన్ తేల్చింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి కేబినెట్ ఆమోదం లేదని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తెలిపింది. పీసీ ఘోష్ కమిషన్ నివేదికలో తొమ్మిది సార్లు హరీశ్ రావు పేరు ప్రస్తావించారన్నారు. జలవనరుల కోసమే కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజాధనం దుర్వినియోగం చేయడంపైనే పీసీ ఘోష్ కమిషన్ ను ఏర్పాటు చేయడం జరిగిందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతెలిపారు. భారీ స్థాయిలో అవినీతి జరిగిందని కమిషన్ తేల్చిందని భట్టి విక్రమార్క తెలిపారు.

# అది భారత్ హక్కు.. వద్దని చెప్పడానికి మీరెవరూ..?

# ట్రంప్ బెదిరింపులపై రష్యా సీరియస్

రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న విషయంలో భారత్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు జారీ చేయడంపై రష్యా తీవ్రంగా స్పందించింది. ఈ వివాదంలో భారత్‌కు పూర్తి మద్దతు ప్రకటించింది. సార్వభౌమ దేశాలు తమ వాణిజ్య భాగస్వాములను ఎంచుకునే హక్కును కలిగి ఉంటాయని, దానిని ఎవరూ ప్రశ్నించలేరని స్పష్టం చేసింది. రష్యా అధ్యక్షుడి ప్రెస్ సెక్రటరీ డిమిత్రి పెస్కోవ్ మంగళవారం ఈ విషయంపై మాట్లాడారు. భారత్‌ను ఉద్దేశించి అమెరికా చేస్తున్న బెదిరింపులను తాము గమనిస్తున్నామని, అయితే వాటిని చట్టబద్ధమైనవిగా పరిగణించబోమని ఆయన తెలిపారు. ప్రతి దేశం తమ ప్రయోజనాలకు అనుగుణంగా వాణిజ్య భాగస్వాములను ఎంచుకునే హక్కు ఉంటుందని రష్యా ప్రభుత్వ వార్తా సంస్థ 'టాస్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో నొక్కిచెప్పారు.

**ట్రంప్ ఆరోపణలు ఇవే...**

రష్యా నుంచి భారత్ భారీ మొత్తంలో చమురు కొనుగోలు చేస్తోందని ట్రంప్ ఆరోపించారు. అలా కొన్న చమురును బహిరంగ మార్కెట్‌లో అమ్మి లాభాలు గడిస్తోందని సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. "ఉక్రెయిన్‌లో రష్యా యుద్ధ యంత్రం వల్ల ఎంత మంది చనిపోతున్నారనే దాని గురించి వారు పట్టించుకోవడం లేదు. అందుకే భారత్ అమెరికాకు చెల్లించే సుంకాలను గణనీయంగా పెంచుతాను" అని ఆయన హెచ్చరించారు.

**ఘాటుగా బదులిచ్చిన భారత్**

ట్రంప్ హెచ్చరికలపై భారత ప్రభుత్వం సోమవారమే తీవ్రంగా స్పందించింది. రష్యా చమురు కొనుగోలు విషయంలో అమెరికా తమను లక్ష్యంగా చేసుకోవడం అన్యాయమని, అర్థరహితమని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. దేశ ప్రయోజనాలు, ఆర్థిక భద్రతను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని స్పష్టం చేసింది. ఉక్రెయిన్ సంక్షోభం తర్వాత సాంప్రదాయ ఇంధన వనరులు యూరప్ కు మళ్లడంతోనే తాము రష్యా నుంచి దిగుమతులు ప్రారంభించామని గుర్తుచేసింది. తమను విమర్శిస్తున్న దేశాలే రష్యాతో వ్యాపారం చేస్తున్నాయని భారత్ ఎత్తిచూపింది.

ఐరోపా సమాఖ్య (ఈయూ) 2024లో రష్యాతో 67.5 బిలియన్ యూరోల వస్తు వాణిజ్యం చేసిందని, 2023లో 17.2 బిలియన్ యూరోల సేవల వాణిజ్యం జరిపిందని తెలిపింది. ఇది రష్యాతో భారత్ జరిపిన వాణిజ్యం కంటే చాలా ఎక్కువని పేర్కొంది. మరోవైపు, అమెరికా కూడా తన అణు పరిశ్రమ కోసం రష్యా నుంచి యురేనియం, ఎలక్ట్రిక్ వాహనాల కోసం పల్లాడియం, ఎరువులు, రసాయనాలు దిగుమతి చేసుకుంటోందని వివరించింది. ఈ నేపథ్యంలో తమను లక్ష్యంగా చేసుకోవడం సరికాదని భారత్ తేల్చిచెప్పింది.

# జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ కన్నుమూత

భారత రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న సీనియర్ నేత, జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ (79) కన్నుమూశారు. దేశ రాజకీయాల్లో అత్యంత కీలకమైన ఆర్టికల్ 370 రద్దు సమయంలో జమ్మూకశ్మీర్ గవర్నర్‌గా పనిచేసి ఆయన దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచారు. సుదీర్ఘకాలం అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం తుదిశ్వాస విడిచారు. 1960వ దశకంలో మీరట్‌లో విద్యార్థి నాయకుడిగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన సత్యపాల్ మాలిక్, ఐదు దశాబ్దాలకు పైగా ప్రజా జీవితంలోనే గడిపారు. ఉత్తరప్రదేశ్ శాసనసభ్యుడిగా, లోక్‌సభ, రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, పర్యాటక శాఖ సహాయ మంత్రిగా పలు ఉన్నత పదవులను ఆయన అలంకరించారు. కాంగ్రెస్, జనతాదళ్, బీజేపీ వంటి పలు పార్టీలలో పనిచేసిన అనుభవం ఆయన సొంతం. ఆయన రాజకీయ జీవితంలో అత్యంత కీలకమైన, చరిత్రాత్మకమైన ఘట్టం జమ్మూకశ్మీర్ గవర్నర్‌గా పనిచేసిన కాలం. 2018 నుంచి 2019 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగారు. ఆయన హయాంలోనే కేంద్ర ప్రభుత్వం కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసింది. కశ్మీర్‌కు గవర్నర్‌గా వ్యవహరించిన సమయంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు ప్రశంసలతో పాటు విమర్శలను కూడా ఎదుర్కొన్నాయి.

జమ్మూకశ్మీర్‌తో పాటు బీహార్, గోవా, మేఘాలయ రాష్ట్రాలకు కూడా సత్యపాల్ మాలిక్ గవర్నర్‌గా సేవలందించారు. గవర్నర్ పదవిలో ఉన్నప్పటికీ,

ప్రజా సమస్యలపై, ముఖ్యంగా రైతుల హక్కుల కోసం ఆయన తరచూ గళం విప్పేవారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను బహిరంగంగా విమర్శించి సంచలనం సృష్టించారు. తన చివరి రోజుల్లో క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ, సామాజిక న్యాయం, బడుగు వర్గాల సంక్షేమంపై తన అభిప్రాయాలను వెల్లడిస్తూ మార్గనిర్దేశం చేశారు.

# జగన్ హయాంలోనే రెడ్ బుక్ రాజ్యాంగం నడిచింది

- మొదటి పేజీ తరువాయి

దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో వివిధ శాఖల నుంచి రూ. 430 కోట్ల పనులు తన నియోజవర్గంలో జరుగుతున్నాయని చెప్పారు. టిడ్కో గృహాల ప్రారంభోత్సవ సభలో స్టేజిపై నుంచి తమను గెంటివేసినప్పుడు సాక్షి పత్రిక ఏమైందని మండిపడ్డారు. తమపై దాడులు చేసి తమపైనే ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టిన చరిత్ర వైసీపీదని అన్నారు. తాము నిర్మించిన ఒక్కో టిడ్కో ఇంటిపై రూ. 3.65 లక్షల రుణం తీసుకుని గత జగన్ ప్రభుత్వం దారి మళ్లించిందని ఆరోపించారు.

# 24 గంటల్లో భారత్‌పై మరిన్ని సుంకాలు పెంచుతాం

- మొదటి పేజీ తరువాయి

చమురు కొనుగోలు చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు ట్రంప్.

భారత్ మంచి వాణిజ్య భాగస్వామి కాదని, ఆ దేశంతో వ్యాపారం చాలా కష్టంగా మారిందన్నారు. భారత్ విధించే సుంకాలు చాలా ఎక్కువగా ఉంటాయని.. అందుకే మేం వారితో ఎక్కువ వ్యాపారం చేయమని చెప్పారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని అవకాశంగా మల్చుకుని రష్యా నుంచి ఇంధనం కొనుగోలు చేసి వ్యాపారం చేస్తోన్న ఇండియాపై వచ్చే 24 గంటల్లో వాణిజ్య సుంకాలను గణనీయంగా పెంచుతామని ప్రకటించాడు. ఉక్రెయిన్?తో మూడేళ్లుగా యుద్ధం చేస్తోన్న రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తే సుంకాలు విధిస్తామని ట్రంప్ ప్రపంచ దేశాలను హెచ్చరించారు. ట్రంప్ బెదిరింపులను పట్టించుకోని భారత్.. రష్యా నుంచి అలాగే చమురు దిగుమతి చేసుకుంటోంది. తమ మాట వినని ఇండియాపై కోపం పెంచుకున్న ట్రంప్.. అమెరికాలో భారత దిగుమతులపై 25 శాతం వాణిజ్య సుంకాలు విధించాడు. అమెరికా 25 శాతం ట్రేడ్ టారిఫ్స్ విధించడంతో తలొగ్గిన భారత్.. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు ఆపేసిందని ప్రచారం జరిగింది. ఈ ప్రచారాన్ని కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. దేశ ప్రయోజనాల దృష్ట్యా రష్యా నుంచి యధావిధిగా చమురు దిగుమతి చేసుకుంటామని స్పష్టం చేసింది. దీంతో మరింత ఆగ్రహానికి గురైన ట్రంప్.. ఇప్పటికే విధించిన 25 శాతం కాకుండా భారత్?పై మరిన్ని సుంకాలు విధిస్తామని హెచ్చరించాడు.

# రూ.17 వేల కోట్ల లోన్ ఫ్రాడ్ కేసు... అనిల్ అంబానీపై ఈడీ ప్రశ్నల వర్షం

ప్రముఖ పారిశ్రామికవేత్త, రిలయన్స్ గ్రూప్ (ఆర్ఏఏజీఏ) ఛైర్మన్ అనిల్ అంబానీ మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎదుట విచారణకు హాజరయ్యారు. రూ.17 వేల కోట్ల బ్యాంకు రుణాల మళ్లింపు, మనీలాండరింగ్ ఆరోపణలకు సంబంధించిన కేసులో అధికారులు ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. "తీసుకున్న రుణాలను డొల్ల కంపెనీలకు మళ్లించారా?", "నిధులు ఏవైనా రాజకీయ పార్టీలకు చేరాయా?", "అధికారులకు లంచాలు ఇచ్చారా?" వంటి కీలక ప్రశ్నలను ఈడీ అధికారులు సంధించినట్టు సమాచారం. గత దశాబ్ద కాలంగా అనిల్ అంబానీ తన గ్రూప్ కంపెనీలు తీసుకున్న రుణాలను వాటి అసలు ప్రయోజనాలకు కాకుండా ఉద్దేశపూర్వకంగా పక్కదారి పట్టించారనే ఆరోపణలపై ఈడీ దృష్టి సారించింది. ఈ కేసులో రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రిలయన్స్ కమ్యూనికేషన్స్ వంటి పలు కంపెనీలు ఉన్నాయి. ముఖ్యంగా 2017 నుంచి 2019 మధ్య యెస్ బ్యాంక్ నుంచి తీసుకున్న సుమారు రూ. 3,000 కోట్ల రుణాల మళ్లింపు ఒక అంశం కాగా, రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు సంబంధించిన రూ. 14,000 కోట్లకు పైగా భారీ మోసం మరో కీలక అంశంగా ఉంది.

ఈ కేసు దర్యాప్తులో భాగంగా గత వారం ఈడీ అధికారులు ముంబై, ఢిల్లీలోని అనిల్ అంబానీకి సంబంధించిన పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో పెద్ద ఎత్తున పత్రాలు, హార్డ్ డ్రైవ్‌లు, ఇతర డిజిటల్ రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. యెస్ బ్యాంక్ రుణ మోసం కేసులో మనీలాండరింగ్

కోణంలో మొదలైన ఈ దర్యాప్తు, ఇప్పుడు మరింత విస్తృతంగా మారింది. బ్యాంకు నిధులను డొల్ల కంపెనీల ద్వారా మళ్లించి, రిలయన్స్ గ్రూప్ సంస్థలు దుర్వినియోగం చేశాయా అనే దానిపై ఈడీ ప్రధానంగా దృష్టి సారించింది. ఇదే సమయంలో, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) కూడా అనిల్ అంబానీ గ్రూపులోని ఇతర కంపెనీలపై తనదైన శైలిలో విచారణ ప్రారంభించినట్లు తెలుస్తోంది. కాగా, అనిల్ అంబానీ విచారణను అధికారులు కెమెరాల్లో రికార్డ్ చేస్తున్నారని, విచారణ సమయంలో న్యాయవాదిని అనుమతించలేదని నివేదికలు చెబుతున్నాయి.

# జీవితంలో నేను రెండుసార్లు కంటతడి పెట్టుకున్నా

తన జీవితంలో తాను కేవలం రెండుసార్లు కంటతడి పెట్టుకున్నానని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు. అమ్మ గుర్తుకు వచ్చినప్పుడు కంటతడి పెట్టుకున్నానని చెప్పారు. తాను తన అమ్మను చూడలేదని ఆయన భావోద్వేగానికి గురయ్యారు. రెండోది, తనను బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి పిలిచి ఉప రాష్ట్రపతిని చేసినప్పుడు కంటతడి పెట్టుకున్నానని చెప్పారు. తనకు రాజకీయాల నుంచి వైదొలగడం ఇష్టం లేదని ఆయన తెలిపారు. ఉప రాష్ట్రపతి అయినప్పటి నుంచి తాను ఇప్పటి వరకు బీజేపీ కార్యాలయానికి వెళ్లలేదని వెంకయ్యనాయుడు తెలిపారు. ఉప రాష్ట్రపతిగా రిటైర్ అయిన తర్వాత యువత కోసం రాజకీయాల గురించి మాట్లాడుతున్నానని చెప్పారు. సీనియర్ సంపాదకులు ఇనగంటి వెంకట్రావు రాసిన 'విలీనం-విభజన-మన ముఖ్యమంత్రులు' పుస్తకావిష్కరణ కార్యక్రమానికి వెంకయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ పుస్తకాన్ని నేట

యువత తప్పనిసరిగా చదవాలని ఆయన సూచించారు. ఈ పుస్తకం చదివితే నాయకుల పాలన, వారి గురించి అన్ని వివరాలు తెలుస్తాయని చెప్పారు. వ్యూస్ కోసం మనం న్యూస్ రాయకూడదని అన్నారు. మన అభిప్రాయాలను పంచుకోవడానికి కాలమ్స్ ఉన్నాయని చెప్పారు. భాష విషయంలో నాయకులు చాలా హుందాగా వ్యవహరించాలని హితవు పలికారు. పాత్రికేయంలో కూడా భాష చాలా ముఖ్యమని చెప్పారు.

# ఆర్టికల్ 370 రద్దుకు ఆరేళ్లు.. దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన పవన్ కల్యాణ్

- మొదటి పేజీ తరువాయి

చేసే దిశగా వేసిన ఒక చారిత్రాత్మక ముందడుగు అని ఆయన అభిప్రాయపడ్డారు. 2019 ఆగస్టు 5న కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ చట్టం రద్దుతో జమ్మూకశ్మీర్‌ను రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా (జమ్మూకశ్మీర్, లడఖ్) విభజించారు. ఈ ఆరో వార్షికోత్సవం సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. ఈ నిర్ణయం దేశంలోని అన్ని రాష్ట్రాల మధ్య సమానత్వాన్ని పెంపొందించిందని, జాతీయ సమగ్రతను మరింత బలపరిచిందని పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో పాలన, మౌలిక సదుపాయాలు, సామాజిక అభివృద్ధి రంగాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయని ఆయన నొక్కి చెప్పారు. అధికారిక గణాంకాల ప్రకారం, 2019 నుంచి ఇప్పటివరకు ఆ ప్రాంతంలో సుమారు 5,600 కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు

వచ్చాయని, మరో 66,000 కోట్ల రూపాయల విలువైన ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. ఈ పరిణామాలు కశ్మీర్ భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నాయని అన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఈ బిల్లుకు రాజ్యసభలో 125-61, లోక్‌సభలో 370-70 ఓట్ల తేడాతో భారీ మెజారిటీతో ఆమోదం లభించింది. ఈ నిర్ణయం దేశ సమైక్యతను, రాజ్యాంగ సమగ్రతను కాపాడటానికి తీసుకున్న సాహసోపేతమైన చర్యగా పవన్ కల్యాణ్ వంటి నేతలు అభివర్ణిస్తున్నారు.

# అసలైన భారతీయుడెవరో న్యాయమూర్తులు నిర్ణయించరు

- మొదటి పేజీ తరువాయి

దేశభక్తిని నిర్ధారించడం వారి పని కాదని ఆమె అన్నారు.

భారత సాయుధ బలగాల గురించి రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యల పట్ల సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చిన కొద్దిసేపటికే ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ, "ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్ష నాయకుడి ప్రాథమిక బాధ్యత. మా సోదరుడు రాహుల్ గాంధీ సైన్యానికి వ్యతిరేకంగా ఎన్నడూ మాట్లాడరు. ఆయనకు మన సైన్యం పట్ల అపారమైన గౌరవం, అభిమానం ఉన్నాయి" అని వివరించారు.


ప్రతిపక్ష నాయకుల దేశభక్తిని, పౌరసత్వాన్ని ప్రశ్నించే ప్రయత్నాలను ప్రియాంక గాంధీ తీవ్రంగా ఖండించారు. గతంలో 2019లో రాహుల్ గాంధీ పౌరసత్వంపై ప్రశ్నలు తలెత్తినప్పుడు కూడా ఆమె ఇదే విధంగా గట్టిగా బదులిచ్చారు. "రాహుల్ గాంధీ భారతీయుడని దేశం మొత్తానికీ తెలుసు. ఆయన ఇక్కడే పుట్టారు, అందరి కళ్ల ముందే పెరిగారు. ఈ విషయం అందరికీ తెలిసినప్పుడు, ఇటువంటి అర్థం లేని ఆరోపణలు ఎందుకు?" అని ఆమె గతంలో వ్యాఖ్యానించారు.

# ఏపీ బలంగా పుంజుకుంటోంది... ఈ వసూళ్లే నిదర్శనం

- మొదటి పేజీ తరువాయి

సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఈ సదస్సులో మంత్రి నారా లోకేష్, రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో పాటు 250 మందికి పైగా పారిశ్రామికవేత్తలు, ఇతర ప్రముఖులు పాల్గొననున్నారు.

## తిరుచానూరులో వరలక్ష్మీ వ్రతానికి విస్తృత ఏర్పాట్లు




**తిరుమల పెన్ పవర్ ఆగస్టు 5 :** ఆగస్టు 8వ తేది వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. భక్తులు అమ్మవారి దర్శనాన్ని సౌకర్యవంతంగా పొందేందుకు ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా తిరుచానూరు ఆలయం పరిధిలో ప్రత్యేక క్యూ లైన్లు, భక్తులకు అన్నప్రసాదం, తాగునీటి సరఫరా, శోభాయమానంగా విద్యుద్దీపాల అలంకరణలు, పుష్పాలంకరణ, పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 10 నుండి 12 గంటల వరకు ఆస్థాన మండపంలో వరలక్ష్మీ వ్రతం నిర్వహించబడుతుంది. భక్తులు ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఆలయం పరిధిలో ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేయడంతో పాటు ఎస్వీబీసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారాలు అందించనున్నారు. అదే రోజు సాయంత్రం అమ్మవారు స్వర్ణరథంపై మాడ వీధులలో విహరిస్తారు. ఈ శోభాయాత్ర భక్తులను కనువిందు చేయనుంది.

**టిటిడి ఆలయాల్లో సౌభాగ్యం :** మహిళా భక్తులకు 'సౌభాగ్యం' కార్యక్రమం ద్వారా అమ్మవారి అనుగ్రహం అందేలా చర్యలు చేపట్టారు. అదేవిధంగా, రెండు తెలుగు రాష్ట్రాల్లోని 51 టీటీడీ స్థానిక ఆలయాల్లో నిర్వహించే 'సౌభాగ్యం' కార్యక్రమం ద్వారా మహిళా భక్తులకు అక్షింతలు, పసుపు దారాలు, కుంకుమ, కంకణాలు, శ్రీలక్ష్మీ అష్టోత్తర శతనామావళి పుస్తకం, గాజులు వంటి పవిత్ర సామగ్రిని పంపిణీ చేయనున్నారు. టీటీడీ ఆలయాల్లో సదరు అధికారులు, సిబ్బంది ఈ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా

# ఆగస్టు 19 నుంచి పీ4 అమలు

## జీరో పావర్టీ 2029 నాటికి సాకారం - అదే మొదటి అడుగు



అనంతపురం, పెన్ పవర్ ఆగస్టు 05 : పేదరిక నిర్మూలనకు చేపడుతున్న జీరో పావర్టీ–పీ4 లక్ష్యం 2029 నాటికి సాకారం అవుతుందని.. ఇదే మొదటి అడుగు అవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన పీ4 కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. మంగళవారం సచివాలయంలో పీ4 పై ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 19వ తేదీ నుంచి పీ4 అమలు చేయాలని ఈ సమీక్షలో నిర్ణయించారు. సచివాలయంలో నిర్వహించిన ఈ సమీక్షకు సీఎస్ విజయానంద్, ఆర్ధిక మంత్రి పయ్యావుల కేశవ్, పీ4 ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కుటుంబరావు, ఆర్ధిక, ప్రణాళిక శాఖ అధికారులు హాజరయ్యారు. అనంతపురం జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఇంచార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, సి పి ఓ.అశోక్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. సమీక్షలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ "పేదరిక నిర్మూలనలో భాగంగానే పీ4 కార్యక్రమాన్ని చేపట్టాం. బంగారు కుటుంబాలకు మెరుగైన జీవన ప్రమాణాలే లక్ష్యం. సమాజానికి తిరిగి ఇవ్వాలన్నదే ప్రధాన ఉద్దేశం. మార్గదర్శుల నుంచి చిన్న ఆసరా పేదలకు కొండంత అండ అవుతుంది. ఆ స్ఫూర్తితోనే అవనిగడ్డ నియోజకవర్గానికి చెందిన పారిశుద్ధ్య కార్మికురాలు పల్లెకుంట హేమలత మార్గదర్శిగా మారి ఓ వృద్ధురాలిని ఆదుకుంటున్నారు. స్పందించే మనస్సు ఉంటే... పేదల్ని ఆదుకునేందుకు మానవత్వం చూపుతూ ముందుకు వస్తారు. డబ్బుతో పాటు.. సాయం చేసే వారు కూడా మార్గదర్శులే. బంగారు కుటంబాలకు కావాల్సింది ఎమోషనల్ బాండింగ్, చేయూత మాత్రమే. సీఎస్సార్ నిధులతో బిల్ గేట్స్, వేదాంత లాంటి సంస్థలు పనిచేస్తున్నాయి. వీటికి మించి కుటుంబాలను ఆదుకోవటమే లక్ష్యంగా పీ4 కార్యక్రమం చేపట్టాం. ప్రజలే ఆస్తిగా జీరో పావర్టీ మిషన్ అమలు చేస్తున్నాం." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**మార్గదర్శుల ఎంపిక స్వచ్ఛందమే :** "బంగారు కుటుంబాలను ఆదుకోవటంలో మార్గదర్శుల ఎంపిక పూర్తిగా వాలంటరీగానే జరుగుతోంది. ఎక్కడా ఎవరిపైనా బలవంతం లేదు. మార్గదర్శుల ఎంపికలో ఎక్కడా వ్యతిరేకత రాకూడదు. ఎవరినీ బలవంతం చేయొద్దు. మానవత్వం ఉండే వారే ఇందులో చేరతారు. మంచి కార్యక్రమాలను అడ్డుకునేందుకు కొందరు రాక్షసుల తరహాలో వ్యవహరిస్తారు. ప్రజల మనస్సుల్లో దీనిపై వ్యతిరేకత తెచ్చేందుకు ప్రయత్నిస్తారు. గతంలో జన్మభూమి, శ్రమదానం, నీరు–మీరు ఇలా ఏ కార్యక్రమం చేపట్టినా ఇదే విధంగా విమర్శించారు. నేను ఇలాంటివి పట్టించుకోను. కొందరికి ఆర్ధిక వనరులు ఉన్నా పేదల్ని ఆదుకోవడానికి మనస్సు రాదు. కొందరికి మనస్సు ఉన్నా సమయం ఉండకపోవచ్చు. ఇలాంటి వారిని గుర్తించండి.. పీ4 వేదిక ఉందని చెప్పండి. ఆర్ధిక అసమానతలు మరింతగా తగ్గాలి. ఇవి పెరిగితే సమాజానికి మంచిది కాదు. ఇవాళ బంగారు కుటుంబంలో సాయం పొందిన వారే రేపు మార్గదర్శి కావచ్చు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు అందుకుంటూనే బంగారు కుటుంబాలకు అదనపు సాయం పీ4 ద్వారా అందుతుంది. విదేశాల్లో ఉన్న ఎన్ఆర్ఐలు, పారిశ్రామిక వేత్తలను కలిసి వారిలో ఆలోచనను రేకెత్తించండి." అని సీఎం సూచించారు.

**ఉద్యమస్ఫూర్తిగా పీ4 :** "ఇప్పటి వరకూ 9,37,913 బంగారు కుటుంబాల ఎంపిక పూర్తి అయింది. 1,03,938 మంది మార్గదర్శులను గుర్తించాం. రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల బంగారు కుటుంబాలకున్న అవసరాలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించాం. 11 ప్రశ్నలతో వివరాలు నమోదు చేసి ఏఐతో విశ్లేషించాం. 31 శాతం మంది ఉద్యోగ అవకాశాలు కల్పిచాలని, 22 శాతం మంది వైద్య చికిత్సలకు సంబంధించి, 9 శాతం మంది తమ చిన్నచిన్న వ్యాపారాలను మరింత పెంచుకోడానికి అవకాశాలు కల్పించాలి. బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవటంతో పాటు గ్రామాలు, మండలాల వారీగా దత్తత తీసుకునేందుకు ముందుకు వస్తున్నారు. అలాగే ఫండ్ ఏ నీడ్ అనే అంశాన్ని కూడా పీ4 కార్యక్రమంలో పెట్టాం. ఈ కార్యక్రమం అమలును ప్రతీ మూడు నెలలకు ఓ మారు సమీక్షించుకుంటాం. ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా ఈ కార్యక్రమంలో వాలంటరీగా పాల్గొనవచ్చు. ప్రస్తుతం నేను కూడా మార్గదర్శిగా పేరు నమోదు చేయించుకుని 250 కుటుంబాలను దత్తత తీసుకున్నాను. ఆ కుటుంబాల సంక్షేమం కోసం ప్రణాళికాబద్దంగా వెళ్తాం. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో ఉత్తరాఖండ్ వరదల సమయంలో ప్రతిపక్షంలో ఉన్నా తెలుగు ప్రజల్ని ఆదుకునేందుకు ముందుకు వచ్చాం. బాధితుల్ని తీసుకువచ్చేందుకు ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేశాం. వారిని ఇళ్లకు చేర్చేందుకు బస్సులు ఏర్పాటు చేశాం. కర్నూలును వరదలు ముంచెత్తిన సమయంలో పిలుపు ఇవ్వగానే లక్షల మందిని ఆదుకున్నారు. మార్గదర్శుల్లో స్ఫూర్తే బంగారు కుటుంబాలకు ఆసరా" అని ముఖ్యమంత్రి అన్నారు.

## డిగ్రీ పరీక్షలను తనిఖీ చేసిన వైవీయూ వీసీ





**కడప పెన్ పవర్ ఆగస్టు 5 :** యోగి వేమన విశ్వవిద్యాలయ కేంద్రంగా జిల్లాలోని అన్ని డిగ్రీ కళాశాలల విద్యార్థులకు సెమిస్టర్ ఇన్స్టంట్ పరీక్షలను మంగళవారం విశ్వవిద్యాలయ ఏపీజే అబ్దుల్ కలాం గ్రంథాలయ ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కే ఎస్ వి కృష్ణారావు తో కలిసి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్ టికెట్లను చూశారు. వసతుల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణలో తీసుకుంటున్న జాగ్రత్తలను అడిషనల్ చీఫ్ సూపరింటిడెంట్ డాక్టర్ టి.లక్ష్మి ప్రసాద్ వివరించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ 278 మంది పరీక్షలకు హాజరు కాగా, ఏడుగురు విద్యార్థులు గైర్హాజరు అయ్యారని తెలిపారు.

**గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన వీసీ :** యోగి వేమన విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని ఏపీజే అబ్దుల్ కలాం గ్రంథాలయాన్ని వై వి యు వి సి ఆచార్య శ్రీనివాసరావు సందర్శించారు. గ్రంథాలయ నిర్వహణ గురించి అక్కడున్న సిబ్బంది ఆయనకు వివరించారు. వసతులు సౌకర్యాలు పుస్తకాలు ఇంకా ఏమైనా అవసరాల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు.

## పియం సూర్యఘర్ పథకాన్ని ప్రజలకు చేరువ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

### - జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్




**చిత్తూరు, పెన్ పవర్ ఆగస్టు 05 :** జిల్లాలో పియం సూర్యఘర్ పథకాన్ని ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలి అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని కలెక్టర్ సమావేశ మందిరం సౌర ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పీఎం సూర్య ఘర్ పథకం, ప్రణాళిక అమలు, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ , జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరితో, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా నియోజకవర్గ మరియు జిల్లా విజన్ ప్రణాళికల పటిష్ట రూపకల్పనకు కృషి చేయాలన్నారు. పీఎం సూర్య ఘర్ పోర్టల్ లో రిజిస్ట్రషన్స్ ఎక్కువ సంఖ్యలో నమోదు అయ్యేలా ఈ పథకంపై ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. పోర్టల్‌లో వచ్చినదరఖాస్తులనుత్వరితగతిన పరిష్కరించి గ్రౌండింగ్, సోలార్ పలకలు అమర్చడం పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఎక్కువ శాతం ఎస్సీ, ఎస్టీలు ఉన్నారని పేర్కొన్నారు.

వీరితోపాటు బీసీ వర్గాల ప్రజలను కూడా రిజిస్ట్రేషన్ పై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. అలాగే జిల్లాలో చేపట్టే సౌర ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణను వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. కుప్పం డివిజన్‌లో ఫీడర్ స్థాయి సోలరైజేషన్ మొత్తం సామర్థ్యం 141mv, 705 ఎకరాలు భూమి అవసరమని,ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ ప్రాజెక్టును మెగా ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, హైదరాబాద్‌కి అప్పగించడం జరిగిందని, 400 ఎకరాల భూమిని గుర్తించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్ పిడీసీఎల్ డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అయుబ్ ఖాన్, సిజిఎం ప్రాజెక్ట్ రమాదేవి, ఎస్ ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఎండి రెస్కో సోమశేఖర్, డివో ఎన్ఆర్ఇడిసిఏపి అబ్దుల్ గయాల్, మెగా ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్, అర్జున్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, ఎస్ఎంఆర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్, తదితరులు పాల్గొన్నారు.

## 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

### – జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి




**వైఎస్సార్ కడప పెన్ పవర్ ఆగస్టు 5 :** 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలు నందు 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు చేయాల్సిన ముందస్తు ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్,డిఆర్వో విశ్వేశ్వర నాయుడు లతో కలసి అన్ని శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..ఈ నెల 15న స్థానిక పోలీసు పెరేడ్ గ్రౌండ్ లో నిర్వహించే వేడుకల్లో.. జెండా వందన కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను, వేదికను అందంగా అలంకరించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర సమర యోధుల కుటుంబ సభ్యులు, ఇతర అతిథులను వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించాలని సంబందిత అధికారులను ఆదేశించారు.కార్యక్రమానికి హాజరైన వారికి తాగు నీటిని సరఫరా, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని కడప మునిసిపల్ కమీషనర్‌ను ఆదేశించారు. ఆహ్వాన పత్రికలు, ప్రోటోకాల్ అంశాలపై జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలనీ డిఆర్ఓను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి సంబంధించి జిల్లాలో సాధించిన ప్రగతిని చాటిచెప్పేలా శకటాలు, ఎగ్జిబిషన్ స్టాళ్ళను ఏర్పాటు చేయాలని డిఆర్డీఏ, డ్వామా, అగ్రికల్చర్ మెప్మా, ఐసిడిఎస్ పంచాయతీరాజ్, హార్టికల్చర్, ఎస్సీ కార్పొరేషన్, బీసీ కార్పొరేషన్, డియం హెచ్ఓ తదితర శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఉదయం పెరేడ్ మైదానంలో, సాంస్కృతిక కార్యాక్రమాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను కన్నుల పండువగా సాగేలా సంసిద్ధం చేయాలని డీఈవోను ఆదేశించారు. నిరంతర విద్యుత్తు సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీడిసిఎల్‌ను ఆదేశించారు.

పెరేడ్ మైదానంలో రంగు కాగితాలు, పూల అలంకరణతో శోభాయమానంగా తీర్చిదిద్దాలన్నారు. 108 వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలని డిఎంహెచ్‌వోను ఆదేశించారు. ఆయా శాఖల్లో విశిష్ట సేవలు అందించిన ఉత్తమ అధికారులు, సిబ్బంది, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేయడానికి సంబంధిత ప్రతిపాదిత జాబితాను నిర్ణీత గడువు లోపు అందించాలని ఆదేశించారు. జాతీయ పతాక ఆవిష్కరణ, పోలీసుల మార్చి ఫాస్ట్ లో ఎన్ సిసి కేడెట్లను భాగస్వామ్యం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా, అత్యంత జాగ్రత్తగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో కడప, జమ్మలమడుగు ఆర్డీఓలు జాన్ ఇర్వీన్, సాయిశ్రీ, కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, సీపీవో హజ్రతయ్య, డిఆర్డీఏ, డ్వామా, మెప్మా పీడిలు రాజ్యలక్ష్మి, ఆది శేషా రెడ్డి,కిరణ్ కుమార్, వ్యవసాయ శాఖ జెడి చంద్ర నాయక్,డిఎంహెచ్ వో నాగరాజు, అండ్ బి, పంచాయతీ రాజ్, ఆర్టీసీ తదితర అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆదాయం పెంచి.. అభివృద్ధి చూపిస్తాం

### - స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుంటాం - కీలక అభివృద్ధి పనులకు మంత్రి టీజీ భరత్



**వైఎస్సార్ కడప పెన్ పవర్ ఆగస్టు 5 :** మున్సిపల్ కార్పొరేషన్‌కి ఆదాయాన్ని పెంచి, వాటితో నగరాన్ని తీర్చిదిద్దుతామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. మంగళవారం ఆయన, ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి రెడ్డి, కమిషనర్ పి.విశ్వనాథ్‌తో కలిసి కీలకమైన మూడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముందుగా 13వ వార్డు ఆనంద్ థియేటర్ ఎదురుగా హంద్రీ నది వద్ద రూ.15 లక్షలతో పాకెట్ పార్కులో పచ్చదనం ఏర్పాటుకు, 2వ వార్డులో క్రెడాయ్ అధ్వర్యంలో గడియారం ఆసుపత్రి ఆధునికీకరణ పనులకు శంకుస్థాపనలు చేశారు. అలాగే 19వ వార్డు జొహరపురం రోడ్డున నగరపాలక సంస్థ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన పెట్రోల్ పంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మున్సిపల్ కార్పొరేషన్ పన్నుల మీదే ఆధారపడకుండా ప్రత్యామ్నాయ వనరుల ద్వారా ఆదాయాన్ని సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే మరో పెట్రోల్ పంప్‌ను ఏర్పాటు చేశామని, కార్పొరేషన్ వాహనాలు కూడా ఇక్కడి ఇంధనాన్నే వినియోగించుకోవడం ద్వారా ప్రజాధనాన్ని ఆదా చేయవచ్చున్నారు. ఆనంద్ థియేటర్ ఎదురుగా హంద్రీ నది ఒడ్డున మునుపు డంప్ ఏర్పడి, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా ఉండేదని, ఆ ప్రదేశాన్ని శుభ్రం చేసి పాకెట్ పార్కు ఏర్పాటుకు చర్యలు చేపట్టామని చెప్పారు. ఇప్పటికే గ్రావెల్, ఫెన్సింగ్ పనులు పూర్తి అయ్యాయని, త్వరలో పచ్చదనం పెంపునకు శ్రీకారం చుట్టామన్నారు. భవిష్యత్తు ఆహ్లాదంగా, ఆకర్షణీయంగా

**గడియారం ఆసుపత్రికి పూర్వవైభవం తీసుకొస్తాం :** పాత నగరంలో పురాతన కట్టడమైన గడియారం ఆసుపత్రికి పూర్వవైభవం తీసుకొచ్చి, పరిసరాల ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి పేర్కొన్నారు. తమ విజ్ఞప్తి మేరకు క్రెడాయ్ సంస్థ గడియారం ఆసుపత్రిని దత్తత తీసుకునేందుకు ముందుకొచ్చిందని, ముందుగా రూ.20 లక్షలతో ఆధునికీకరణ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. త్వరలో పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు.

**కల్లూరు ప్రాంత రూపురేఖలు మారుస్తాం :** కల్లూరు అర్బన్ రూపురేఖలను మారుస్తామని ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి అన్నారు. 16 వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో రూ.50 కోట్ల ప్రత్యేక నిధులతో మౌలిక వసతుల అభివృద్ధి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. కమిషనర్ పి.విశ్వనాథ్ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధుల ఆలోచనల మేరకు నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నమన్నారు. క్రెడాయ్ సంస్థ గడియారం ఆసుపత్రిని దత్తత తీసుకునేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. అందరి సహకారంతో నగరాన్ని తీర్చిదిద్దుతామని కమిషనర్ పేర్కొన్నారు.

## శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు ప్రారంభం

**తిరుమల పెన్ పవర్ ఆగస్టు 5 :** తిరుమల శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు మంగళ వారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు పవిత్ర ప్రతిష్ట నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారిని పవిత్ర మండపంలోని యాగశాలకు వేంచేపుచేశారు. అక్కడ హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం సంపంగి ప్రాకారంలో వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు పంచసూక్తాలను పఠించారు. ఆ తర్వాత పవిత్ర ప్రతిష్ట జరిగింది. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లకు విశేష సమర్పణ చేశారు. అనంతరం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి యాగశాలలో వైదిక కార్యక్రమాలు జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, ఆలయ ప్రధాన అర్చకులు, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, పేష్కర్ రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

## 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

### - జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్



**తిరుపతి, పెన్ పవర్ ఆగస్ట్ 5 :** 79 వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పక్కాగా ఏర్పాట్లు చేసి ఘనంగా నిర్వహిద్దామని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ జెసి శుభం బన్సల్, తిరుపతి మునిసిపల్ కమిషనర్ నారపు రెడ్డి మౌర్య, డిఆర్ఓ నరసింహులు తో కలిసి ఈ నెల ఆగస్ట్ 15న నిర్వహించనున్న 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించి అధికారులతో సన్నద్ధత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఈ నెల ఆగస్ట్ 15న పోలీసు పెరేడ్ గ్రౌండ్ నందు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమ ఏర్పాట్లు పూర్తి పర్యవేక్షణ తిరుపతి ఆర్డీఓ చేయాలని సూచించారు. పెరేడ్ గ్రౌండ్ నందు బందోబస్తు, జెండా వందనం, వేదిక అలంకరణలు, కవాతు ఏర్పాట్లను పోలీస్ శాఖ, తుడా వారు వివిధ అంశాల సమన్వయంతో ఏర్పాట్లు ఉండాలని సూచించారు. విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమ నిర్వహణ డిఈఓ చూడాలని, ప్రథమ చికిత్స కేంద్రం మరియు అత్యవసర వైద్య సేవల ఏర్పాట్లను డిఎంఅండ్ హెచ్ఓ, వివిధ గాలరీల ఏర్పాటు, పారిశుద్ధ్యం, త్రాగునీరు వసతి ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్, గ్రామీణ నీటి సరఫరా ఎస్.ఈ ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలపై స్టాల్స్ మరియు శకటాలను వివిధ శాఖలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని పలు శాఖలు సాధించిన ప్రగతి నివేదిక తయారీ, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ను సమాచార శాఖ పర్యవేక్షించాలని తెలిపారు. ఇండిపెండెన్స్ డే ఏర్పాట్ల కొరకు కేటాయించిన పనులను ఎలాంటి లోపాలు లేకుండా సంబంధిత శాఖలు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన ప్రమాణాలను పాటించండి

### - జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల, పెన్ పవర్ ఆగస్టు, 05 :** ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన ప్రమాణాలను పాటించి కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాలను పొందాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో డిస్ట్రిక్ట్ క్వాలిటీ అస్యూరెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... జాతీయ స్థాయి సర్టిఫికేషన్ కార్యక్రమానికిగాను కేంద్ర ప్రభుత్వం జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులలో ఉత్తమ ప్రమాణాలు పాటించిన 57 ఉత్తమ ప్రమాణాలు పాటించిన ఆసుపత్రాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ ఆసుపత్రులలో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించినందుకు గాను ప్రోత్సాహకం రూపంలో సంవత్సరానికి మూడు లక్ష రూపాయల చొప్పున మూడు సంవత్సరాలకు తొమ్మిది లక్షల రూపాయలు అందజేస్తారని చెప్పారు. ఈ నగదుతో సదరు ఆసుపత్రులలో ఇంకా మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించి ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలని కలెక్టర్ వైద్యాధికారులను ఆదేశించారు. అదేవిధంగా మిగిలిన ప్రభుత్వ ఆసుపత్రులలో కూడా సదరు సదుపాయాలను ఏర్పాటు చేసుకొని వారు కూడా కేంద్ర ప్రభుత్వం నుండి నగదు లబ్ధిని పొందేలా కృషి చేయాలన్నారు. అనంతరం సదుపాయాల ఏర్పాటు కోసం కృషిచేసిన 16 మంది వైద్య సిబ్బందికి కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. సమావేశంలో డిఎంహెచ్ఓ వెంకటరమణ, జిజిహెచ్ సూపరింటెండెంట్ మల్లీశ్వరి, డిసిహెచ్ఎస్ లలితా, డిపిఎంఓ అంకిరెడ్డి, డిస్టిక్ క్వాలిటీ కన్సల్టెంట్స్ లక్ష్మణ్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఓవర్ హెడ్ స్టోరేజ్ ట్యాంక్...



**కర్నూలు పెన్ పవర్ ఆగస్టు 5 :** ఓర్వకల్లు మండలంలోని కాల్వ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఓవర్ హెడ్ స్టోరేజ్ ట్యాంక్కి సంబంధించి భూమి పూజ నిర్వహించిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్.

# తల్లిదండ్రులు, వయోవృద్ధుల, సంక్షేమ చట్టం 2007 అవగాహన కార్యక్రమాలు

### ఆర్డిఓ అధ్యక్షతన ట్రిబ్యునల్.. : డిఆర్ఓ నరసింహులు




**తిరుపతి, పెన్ పవర్ ఆగస్టు 05 :** తల్లిదండ్రులు, వయోవృద్ధుల, సంక్షేమ చట్టం, 2007 విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డిఆర్ఓ నరసింహులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల, సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్ జెండర్ శాఖ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమ చట్టం, 2007, మరియు ట్రాన్స్ జెండర్ హక్కుల చట్టం 2019 అమలపై ఒక్క రోజు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్స్ ట్రాన్స్ జెండర్ ల సంక్షేమ శాఖ ఏ డి వినోద్, పీడీ ఐసీడీస్ శ్రీమతి వసంత, S V university retid అసోసియేట్ ప్రొఫెస్సార్ ఆదినారాయణ రెడ్డి మరియు పాస్ ngo సెక్రటరీ బాలకృష్ణ మూర్తి , తదితరులు మరియు జిల్లా adhikarulu పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ తల్లిదండ్రులు మరియు పిల్లల మధ్య సఖ్యత లేని కారణంగా వారి మధ్య వివాదాలు తలెత్తుతున్నాయన్నారు. శ్రీమంతుల కుటుంబాలో కూడా ఇటువంటి పరిస్థితి చూస్తున్నామన్నారు. తల్లితండ్రుల, వృద్ధుల సంరక్షణలో ఆయా కుటుంబ సభ్యుల బాధ్యత వహించాల్సి ఉందని, తల్లిదండ్రులతో సహా ఎవరైనా సీనియర్ సిటిజన్ తన స్వంత సంపాదన నుంచి లేదా అతని స్వంత ఆస్తి నుంచి తనను తాను కాపాడుకోలేక పోయినప్పుడు ప్రాథమికంగా ఆర్డిఓ అధ్యక్షతన ఉన్న ట్రిబ్యునల్ కు ఫిర్యాదు చేయవక్చునని, ఆర్డిఓ ద్వారా నోటీసులు అందించి విచారణ చేసి సమస్యను సానుకూలంగా పరిష్కరించడం జరుగుతుందని, సామరస్యంగా పరిష్కారం కాని సమస్యలకు చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వయోవృద్ధులను, తల్లిదండ్రులను, నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత కుమారుల పైన, కుమార్తెల పైన చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. సీనియర్ సిటిజన్స్ ఈ చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. సీనియర్ సిటిజన్, తల్లిందద్రుల ఆహారం, వైద్యం, వసతి, తదితర ప్రాథమిక అవసరాలను నెరవెర్చలేని వారి వారసులకు తల్లిందద్రులు సీనిరయర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమం చట్టం 2007 ప్రకారం మూడు నెలల వరకు జైలు శిక్ష లేదా రూ.5 వేల జరిమానా విధిస్తారన్నారు. ఇలాంటి సందర్భాల్లో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసి, u/s 173 crpcపై నివేదికను కోర్టుకు దాఖలు చేస్తారు. తల్లితండ్రులను దైవంతో సమానంగా చూడాల్సిన బాధ్యత కుమారులు, కుమార్తెల పై ఉన్నదని తెలిపారు. డివిజన్, మండల, గ్రామ స్థాయిలో ఈ చట్టంపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఈ చట్టం ద్వారా వృద్ధుల జీవితం మరియు వారి ఆస్తి రక్షణ కోసం సరళమైన వేగవంతమైన యంత్రాంగాన్ని అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. వృద్ధులు వారి వారసుల నుండి గౌరవ ప్రదంగా ఆహారం, దుస్తులు, వసతి మరియు వైద్య చికిత్స పొందడానికి అవసరమైన చట్ట సవరణలు చేయడం జరిగిందని తెలిపారు. వృద్ధులు లేక తల్లిదండ్రులు వారు పొందాల్సిన హక్కులకు భంగం వాటినట్లయితే సబ్ డివిజనల్ పరిధిలో సివిల్ కోర్టుతో సమానమైన అధికారాలు గల ఆర్ డి ఓ పరిధిలో ట్రిబ్యునల్ లో దరఖాస్తు దాఖలు చేయవచ్చని, స్వయంగా దరఖాస్తు చేయలేని పరిస్థితిలో ఉన్నట్లయితే రిజిస్టర్డ్ సంస్థల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి నెల సీనియర్ సిటిజన్ల అవసరాల కోసం వారి వారసులు రూ.10 వేలు గరిష్టంగా అందించాలని ఆదేశించిందని తదుపరి కాలక్రమమైన చట్ట సవరణ ద్వారా ఈ గరిష్ట పరిమితిని తొలగించి ఆదాయ పరిమితులను అనుసరించి నిర్ణయించాలని సూచించింది అని తెలిపారు. వారసులు వారి తల్లిదండ్రుల నుండి ఆస్తులు పొందిన తరుణంలో వారి తల్లిదండ్రులకు అవసరమైన కనీస వసతులు, సంక్షేమం చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుందని, నిర్లక్ష్యం వహిస్తే చట్టం ముందు బాధ్యులవుతారని తెలిపారు. నిరుపేద సీనియర్ సిటిజనులకు వసతి ఆహారం వైద్య సంరక్షణ వినోద సౌకర్యాలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి జిల్లాలో కనీసం ఒక వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేసి నిర్వహించాలని చట్టం పేర్కొంటుందని తెలిపారు. ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వ మరియు ప్రభుత్వ ఎయిడెడ్ ఆసుపత్రులతో పాటు ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా ప్రత్యేక పడకలు, క్యూలు మరియు సౌకర్యాలు ఏర్పాటుచేసి సరైన వైద్య సహాయాన్ని అందించాలని తెలిపారు. అసోసియేట్ ప్రొఫెస్సార్ ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్ హక్కుల చట్టం 2019 ద్వారా ట్రాన్స్ జెండర్ లకు హక్కులు కల్పించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్ జెండర్ల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నదని, వాటిని అమలు చేయడంలో జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ట్రాన్స్ జెండర్ లను సమాజిక లింగ వివక్షత నుండి కాపాడాల్సిన భాధ్యత ఉందన్నారు.



## తల్లిపాల ప్రాముఖ్యతను ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలి

### జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్

**తిరుపతి, పెన్ పవర్ ఆగస్టు 5 :** నేడు స్థానిక జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ ఐ.సిడి ఎస్ పి డి వసంతబాయి సంబంధిత అధికారులతో కలిసి తల్లిపాల ప్రాముఖ్యతను గూర్చి తెలుపుతూ ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు 2025 పోస్టర్ కు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ .. తల్లి పాల అవశ్యకతను గూర్చి ప్రతి ఒక్కరికి అవగాహన కలిగేలా ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆగష్ట్ 1 వ తేదీ నుండి 7 వరకు తల్లి పాల వారోత్సవాలు జరుపు కుంటారని అందులో భాగంగా




తిరుపతి జిల్లాలో ప్రతి ఒక్క గర్భిణీ స్త్రీ లకు, బాలింతలకు తల్లి పాల ప్రాముఖ్యతను గూర్చి అవగాహన పెంపొందించేందుకు ఈ నెల ఆగస్టు 1 నుండి 7 వరకు ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు జరుపుకుంటున్నామని తెలిపారు. జన్మించిన మొదటి గంటలోనే కేవలం తల్లిపాలు, బిడ్డకు జీవ రక్షక బిందువులు అని బిడ్డ పుట్టిన



మొదటి గంటలోనే తల్లి యొక్క పసుపు రంగులోని చిక్కటి పాలు (ముర్రుపాలు) అమృతం లాంటివి అని వీటి ద్వారా బిడ్డకు అతి ముఖ్యమైన పోషకాలు లభిస్తాయనీ బిడ్డను అనేక రోగాల నుండి సురక్షితంగా ఉంచుతుంది అని అన్నారు.తల్లిపాల వారోత్సవాల పై గర్భిణిలు, బాలింతలకు అవగాహన కల్పించాలని తెలిపారు. తల్లి పాలు అమృతం మరియు బిడ్డలకు మొదటి టీకా అని తెంపారు. తల్లి కి మొట్ట మొదట గా వచ్చే ముర్రుపాల లో అనేక పోషక పదార్థాలు మరియు వ్యాధి నిరోధక శక్తిని కల్గించే అంటి బాడీస్ విటమిన్లు ఇతర అంశాలు ఉంటాయని కనుక ముర్రుపాలు మరిచి పోకుండా తాగించాలని తెలిపారు. బిడ్డకు 6 మాసాల వరకు కేవలం తల్లి పాలే తాగించాలని ఆ తరువాత నే అనుబంధ ఆహారం ఇవ్వాలని అన్నారు. తల్లిపాలు ఇవ్వడం వలన తల్లికి రొమ్ము కాన్సర్ వచ్చే అవకాశం లేదని అన్నారు. తల్లి పాలు బిడ్డకు 2 సంల వరకు కొనసాగించవచ్చున్నారు. తల్లి పాలు ఇవ్వడం వలన బిడ్డకు తల్లికి అనుబంధం పెరుగుతుందన్నారు. తల్లి పాలు ఇవ్వడం పై ఎటువంటి అపోహలు వలదన్నారు. బాలింత కాలంలో తల్లి ఆకు కూరలు, పాలు, గుడ్లు వంటి మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బెస్ట్ బేబీస్ ఇద్దరికీ జిల్లా కలెక్టర్ వారిచే బహుమానం ప్రధానం చేయడమైనది. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో బాలకృష్ణ నాయక్, డిఐఓ శాంతకుమారి, టాటా ట్రస్ట్ సీనియర్ మేనేజర్ కె.వి.సుబ్రహ్మణ్యం, మహిళా విశ్వవిద్యాలయం హోం సైన్స్ ప్రొఫెసర్ ఎన్.అరుణ, జిల్లాలోని సిడిపివోలు, సూపర్వైజర్లు, అంగనవాడి కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి హామీలకు.. త్వరలోనే కార్య రూపం..



**కడప, పెన్ పవర్ ఆగస్టు 5 :** జమ్మల మడుగు మండలంలోని గూడెం చెరువు గ్రామం లోని పలు కుటుంబా లకు రాష్ట్ర ముఖ్య మంత్రి.. ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబందిత అధికారులతో కలిసి తక్షణ చర్యలు చేపట్టారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్ లోనెక్ బోర్డు మీటింగ్ హాలులో.. గూడెంచెరువు గ్రామంలో కుటుంబాలకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను నెరవేర్చే కార్యాచరణపై సంబందిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు పి4 ఫౌండేషన్ కార్యక్రమానికి మరింత బలం చేకూరేలా.. రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రత్యక్షంగా అందిన వినతుల పట్ల జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తక్షణమే స్పందించించారు. కొంతమంది అర్జీదారులకు పరిష్కార నివేదికను అందివ్వగా.. మరి కొందరు బంగారు కుటుంబాలకు మార్గదర్శుల ద్వారా అందాల్సిన సహాయాన్ని సత్వరమే అందించేందుకు కార్యాచరణ మొదలెట్టారు. ఈనెల 1వ తేదీన జమ్మలమడుగులోని గూడెం చెరువు గ్రామంలో ఇంటింటికి వెళ్లి నేరుగా లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేసిన సందర్భంలో.. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు పలువురు వారి అవసరాలను, సమస్యలను అర్జీల ద్వారా నేరుగా అందజేశారు. వ్య కుటుంబాలు కోరిన విధంగా ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు సత్వరమే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి.. జిల్లా కలెక్టర్ కు తెలపడంతో.. అందుకు స్పందించిన జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ఆ కుటుంబ సభ్యులు చేసిన అభ్యర్థనలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పి4 పథకం కింద ఆయా బంగారు కుటుంబాలకు అందవలసిన అవసరాలను దృష్టిలో ఉంచుకొని వాళ్లకు కావాల్సిన అవసరాలను త్వరితగతిన తీర్చేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, జమామలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, డిఆర్డీఏ పీడి రాజ్యలక్ష్మి, బీసీ కార్పోరేషన్ ఈడీ జయసింహ, సీపీవో హాజరతయ్య, సోషల వెల్ఫర్ డిడి సరస్వతి, సంబందిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన అతి భారీ వినాయక విగ్రహాలు నిషేధం

**తిరుపతి, పెన్ పవర్ ఆగస్ట్ 05 :** వినాయక చవితి నిమజ్జనంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూడాలని, పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారు చేసిన అతి భారీ విగ్రహాలను నిషేదించాలని, వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా పకడ్బందీగా అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో సమన్వయంతో జిల్లాలో సజావుగా ప్రశాంతంగా నిర్వహించాలని, ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ కోరారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో రానున్న వరసిద్ధి వినాయక ఉత్సావాల నిర్వహణ, నిమజ్జనం కార్యక్రమాల నిర్వహణపై జిల్లా కలెక్టర్ గారు ఎస్పి హర్షవర్ధన్, జెసి శుభం బన్సల్, తిరుపతి మునిసిపల్ కమిషనర్ నారపు రెడ్డి మౌర్య, ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, డి.ఆర్.ఓ నరసింహులు, శ్రీ వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ నిర్వాహకులు, అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకుందామని అన్నారు. తిరుపతి నగరంలో మున్సిపల్ కార్పొరేషన్ వారు టీటీడీ సహకార సమన్వయంతో వినాయక నిమజ్జన కార్యక్రమాలు చేపట్టాలని, అందరూ సహకరించాలని అన్నారు. తిరుపతి నగర వినాయక ఉత్సవ కమిటీ ప్రత్యేక శ్రద్ధతో మహోత్సవాలకు సహకారం అందిస్తున్నందుకు సంతోషం అని అన్నారు.




గజ ఈతగాళ్లు తగినంత మంది ఉండేలా చర్యలు తీసుకోవాలని అప్రమత్తంగా ఉండాలని మత్స్య శాఖా వారికి సూచించారు. మనమందరం బాధ్యతగా మట్టి వినాయకులను పూజించి పర్యావరణానికి మేలు కలిగేలా చూడాల్సి ఉంటుందని, లక్షల విగ్రహాలు పూజింప బడతాయని మట్టి వినాయకుల నిమజ్జనం వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని వుండదని తెలిపారు. కోలాటం, భజన కార్యక్రమాలను టీటీడీ వారు ఏర్పాటు చేయాలని, ఆర్చిలు, పట్టణంలో పలు ప్రాంతాల్లో, డెకరేషన్ లైటింగ్, అరటి తోరణాలు ఏర్పాటు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్లీచింగ్, శానిటేషన్, త్రాగు నీరు, స్టేజి, లైటింగ్ ఏర్పాట్లు, బ్యారికేడింగ్ పోలీస్ వారితో సమన్వయము చేసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ కు సూచించారు. నిమజ్జన కార్యక్రమం కొరకు నీటి నిల్వ తగినంత ఉండేలా చూడాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. వినాయక సాగర్, దామినేడు వద్ద నిమజ్జనంలో ఎలాంటి అపశృతులు జరగ కుండా జాగ్రత్తగా నిర్వహించాలని అన్నారు. తుడా నుండి షామి యానా, టేబుల్ ఇతర ఏర్పాట్లు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ వారితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. వినాయక చవితి సందర్భంగా ఎటువంటి బాణాసంచ పెల్చరాదని తెలిపారు. ఆర్టీసీ వారు బస్ ట్రాఫిక్ రూట్ సమన్వయం పోలీస్ వారితో చేసుకోవాలని సూచించారు. అంబులెన్స్ ల ఏర్పాటు, ప్రథమ చికిత్స ఏర్పాటు ఉండాలని వైద్యాధికారులకు సూచించారు. ఏపీఎస్పీడిసిఎల్ వారు పవర్ కట్ లేకుండా చూడాలని, కరెంట్ తీగలు వేలాడుతుంటే వాటిని సరిచేయాలని, నిమజ్జన ప్రాంతంలో జనరేటర్ తదితర ఏర్పాట్లు ఉండాలని సూచించారు. అన్ని పట్టణాల్లో, మండలాల్లో కూడా పోలీస్, రెవెన్యూ, మండల అధికారులు, పంచాయితీ రాజ్, మునిసిపల్ అధికారులు సమన్వయంతో వినాయక విగ్రహ ఏర్పాట్లు, నిమజ్జన ఏర్పాట్లు సామరస్యంగా ప్రశాంతంగా సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వినాయక చవితి పండుగ వాతావరణంలో, భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని, అధికారులు అప్రమత్తంగా బాధ్యతగా వ్యవహరించి ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా ఉమ్మడి జిల్లాలోని హైదరాబాదు లాంటి మహా నగరం లో నిర్వహించే విధంగా మన రాష్ట్రంలోనే తిరుపతి లో కూడా అధికారులు మరియు తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటి సమన్వయంతో ప్రతి ఏట ఘనంగా నిర్వహించుకున్నున్నామని తెలిపారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు ఉండాలని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా వినాయక చవితి మహోత్సవం తిరుపతిలో వినాయక మహోత్సవ కమిటీ సహాయ సహకారాలతో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఘనంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ సంవత్సరం కూడా గతం కన్నా మెరుగ్గా వినాయక చవితి ఉత్సవాలు జరిగేల చూడాలని కోరారు. సింగిల్ విండో విధానంలో ఫైర్, విద్యుత్, పోలీస్, మునిసిపల్ తదితర అధికారులు ఒకే వేదిక లో కూర్చునేలా ఏర్పాటుతో పర్మిషన్లు త్వరితగతిన ఇచ్చేలా ఇవన్నీ విగ్రహాల ఏర్పాటుకు రెండు మూడు రోజులు ముందే ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండపాలలో భక్తి పాటలు మాత్రమే ప్లే చేయాల్సి ఉంటుందని, ఇతర పాటలు ఉండరాదని కోరారు. ఎలాంటి గొడవలు పడకుండా అందరూ ప్రశాంతంగా వినాయక మహోత్సవాలు జరిగేలా అందరూ సహకరించాలని, త్రాగి గొడవలు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశ ప్రారంభానికి ముందు శ్రీ వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ పలు అంశాలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వారు మాట్లాడుతూ పార్వతీ పుత్ర పర్యావరణ మిత్ర అనే కార్యక్రమం ద్వారా మట్టి వినాయకుల తయారీ మరియు వాటిని మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వినాయక సాగర్ నందు వినాయక విగ్రహాల నిమజ్జనం ప్రతిసారీ జరుగుతుందని, అలాగే చుట్టూ ప్రక్కల మూడు చెరువులలో కూడా చుట్టు ప్రక్కల ప్రాంతాల వారు నిమజ్జనం చేస్తారని, 3, 5 రోజులు, 9 రోజులు, 11 రోజులు లో నిమజ్జనం జరుగుతాయని, ఎక్కువ శాతం 3 రోజులకు నిమజ్జనం చేస్తారని, అన్ని శాఖలు సహకరించాలని కోరారు.50 అడుగుల బారీ నాట్య వినాయకుని విగ్రహాన్ని వినాయక సాగర్ లో ఏర్పాటు చేయాలనీ కోరగా అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాన్షి, శ్రీకాళహస్తి, సూళ్ళురుపేట, గూడూరు ఆర్.డి.ఓ లు భానుప్రకాష్, కిరణ్మయి, రాఘవేంద్ర మీనా, అదనపు ఎస్పీ రవి మనోహరా చారీ, జిల్లా పంచాయతీ అధికారిని సుశీల దేవి, తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాసులు, టి.టి.డి బోర్డు మరియు మహోత్సవ కమిటీ మెంబర్ భానుప్రకాష్ , తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ సభ్యులు, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కార్వేటి నగరంలో తొలిసారిగా శ్రీ వరమహాలక్ష్మీ వ్రతం

**తిరుమల పెన్ పవర్ ఆగస్టు 5 :** కార్వేటినగరం శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామివారి ఆలయంలో కొలువైయున్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారి సన్నిధానంలో వరమహాలక్ష్మీ వ్రతాన్ని తొలిసారిగా ఈ ఏడాది ఆగస్టు 8వ తేదిన ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు అంగరంగవైభవంగా నిర్వహించనున్నారు. ఈ పర్వదినాన శ్రీ వరమహాలక్ష్మీ వ్రతంలో పాల్గొనదలచిన భక్తులు (ఇద్దరికి) రూ.500 చెల్లించి ఆన్ లైన్ మరియు ఆఫ్ లైన్ లో ఆలయం వద్ద పొందవచ్చు. వ్రతంలో పాల్గొన్న గృహస్థులకు ఉత్తరీయం, రవికె, లడ్డు, అప్పం, బ్యాగ్, కుంకుమాది ప్రసాదములు బహుమానంగా అందజేస్తారు. ఆగస్టు 6 నుండి 8వ తేదీ వరకు కార్వేటినగరం శ్రీ వేణుగోపాలస్వామివారి తెప్పోత్సవాలు. కార్వేటి నగరం శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామివారి ఆలయంలో ఆగస్టు 6 నుండి 8వ తేదీ వరకు తెప్పోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. ఇందులో భాగంగా మొదటి రోజు ఆగస్టు 6న శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీ కోదండరామస్వామివారు, ఆగస్టు 7, 8వ తేదీల్లో శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామివారు సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు తెప్పలపై విహరించి భక్తులకు దర్శనమిస్తారు. ఈ మూడు రోజుల పాటు ఉదయం 9.30 నుండి 10.30 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 5 నుండి 6.30 గంటల వరకు తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తారు.

## జాబ్ మేళా ద్వారా ఉద్యోగ అవకాశాలు

ఆగస్టు 12వ తేదీన కోవెలకుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా జాబ్ మేళా : జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా





**నంద్యాల, పెన్ పవర్ ఆగస్టు, 05 :** జాబ్ మేళా ద్వారా యువత మెరుగైన ఉపాధి పొంది జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జాబ్ మేళా పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బనగానపల్లె నియోజకవర్గం కోవెలకుంట్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆగస్టు 12న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో 10 ప్రైవేటు కంపెనీలు జి.ఆర్.ఇన్ స్టాచేమే ప్రైవేటు లిమిటెడ్, హిటిరో లాబ్, ఎస్.వి.ఎల్ మాన్ పవర్సొల్యూషన్ ప్రైవేటు లిమిటెడ్, డిక్షన్ ప్రైవేటు లిమిటెడ్, పెన్నార్ ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్, ఆర్ఎస్ ట్రాన్స్ మిషన్ ప్రైవేటు లిమిటెడ్, టి.వి.ఎస్ ఇండియా లిమిటెడ్,ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్, వెంకట్ హ్యూమన్ సర్వీసెస్ లిమిటెడ్ మరియు ఎల్&టి కన్స్ట్రక్షన్ చెందిన హెచ్ ఆర్ ప్రతినిధులు పాల్గొంటారని తెలియజేశారు. ఈ జాబ్ మేళాలో పాల్గొనే యువతీ, యువకులు 5వ తరగతి, పదవ తరగతి, ఐటిఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, బిటెక్, డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ మరియు పీజీ పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులన్నారు. కావున జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగము చేసుకోగలరని తెలియజేశారు. వీటికి సంబంధించిన ఇతర వివరముల కొరకు 9182217075, 9951400588 నెంబర్లకు లేదా naipunyam.ap.gov.in సంప్రదించాలని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ఉపాధి కల్పన అధికారి కళ్యాణి, డిఆర్డిఎ పిడి శ్రీధర్, ఎస్సీ, ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రాజా మహేంద్రనాథ్ పాల్గొన్నారు.

## తల్లిపాలతో బిడ్డకు తల్లికి శ్రీరామరక్ష





**చెన్నూరు, పెన్ పవర్ ఆగస్టు 5 :** చెన్నూరు మండల కేంద్రం లక్ష్మీ నగర్‌లోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను చిన్నమాచుపల్లి సెక్టర్ ఐసిడిఎస్ సూపర్వైజర్ గుర్రమ్మ, మహిళా పోలీస్ సునంద ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిపాలతో బిడ్డకు, తల్లికి శ్రీరామరక్ష అని అన్నారు. బాలింతలకు, గర్భిణీ మహిళలకు తల్లిపాల విశిష్టతను వివరించారు. బిడ్డకు తల్లిపాలు పట్టడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బిడ్డకు తల్లి పాలు పట్టడం ద్వారా తల్లికి రొమ్ము క్యాన్సర్ రాదన్నారు. అనంతరం తల్లిపాల విశిష్టతను తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడి కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.



రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి టీజీ భరత్ జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా.

### రూ.13 లక్షల, బిసి సంక్షేమ బాలికల వసతి గృహంలో

# నూతనంగా 6 టాయిలెట్ల ప్రారంభం

– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల పెన్ పవర్ ఆగస్టు 5 :** నంద్యాల పట్టణం ఎస్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న బీసీ సంక్షేమ బాలికల వసతి గృహంలో సిఎస్ఆర్ నిధులు రూ.13 లక్షల ఖర్చుతో నూతనంగా నిర్మించిన ఆరు టాయిలెట్లను మంగళవారం జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ప్రారంభించారు. పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహంలో దాదాపు 250మంది బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. సదరు వసతి గృహంలో బాలికా విద్యార్థులకు సరిపడా టాయిలెట్లు లేనందున ఇబ్బంది పడుతున్న విషయం కలెక్టర్ దృష్టికి వచ్చింది. ఇందుకు సంబంధించి సిఎస్ఆర్ లో భాగంగా వసతి గృహంలో అదనంగా టాయిలెట్ వసతి కలిగిన బాత్రూంలు నిర్మించాలని రాయలసీమ ఎక్స్ప్రెస్ వే ప్రైవేట్ లిమిటెడ్ వారికి కలెక్టరు సూచించారు. ఈ మేరకు నూతనంగా నిర్మించిన 6 టాయిలెట్ బ్లాక్ లను కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన టాయిలెట్లను కలెక్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహాలలోని విద్యార్థుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తోంది. వసతి గృహంలో ఉంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు అందరూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకోవాలి. ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో బాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానాలను చేరుకోవాలన్నారు. బీసీ సంక్షేమ వసతి గృహంలో సరిపడ టాయిలెట్లు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్న విషయం దృష్టికి వచ్చిన పిదప రాయలసీమ ఎక్స్ప్రెస్ వే వారిని సి ఎస్ ఆర్ లో భాగంగా టాయిలెట్లు నిర్మించాలని కోరడం జరిగిందన్నారు. ఈ మేరకు వారు బాధ్యతగా త్వరితగతిన టాయిలెట్లను నిర్మించి ప్రారంభింప చేయడం సంతోషించదగిన




విషయమని.. ఇందుకు వారిని అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి జగ్గయ్య, రాయలసీమ ఎక్స్ప్రెస్ ప్రాజెక్ట్ హెడ్ మదన్మోహన్ వంగర, వారి సిబ్బంది, వసతి గృహం విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్ పథకాలు కూడా అమలు చేస్తున్నాం

### పరిశ్రమలు, వాణిజ్యం&ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్






**కర్నూలు, పెన్ పవర్ ఆగస్టు 5 :** మంత్రి నారా లోకేష్ యువ గళం పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం గూడెం కొట్టాల వారికి పట్టాలు పంపిణీ చేస్తున్నామని పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ పేర్కొన్నారు. మంగళవారం సాయంకాలం అశోక్ నగర్ నగరపాలక సంస్థ పంప్ హౌస్ ప్రాంతంలో గూడెం కొట్టాల లో అత్యంత ఖరీదైన ఒక ఎకరం స్థలంలో 150 మందికి జీవో ఎంఎస్ నెంబర్:30 ప్రకారం ఇళ్ల పట్టాలను ప్రస్తుతం రెవెన్యూ శాఖ తరపున ఇస్తున్నామని ఆ తరువాత రిజిస్టర్డ్ పట్టాలను వారి పేరు మీద అందజేస్తామని మంత్రి టి.జి.భరత్ తెలియజేశారు. రాష్ట్రంలో ఈ జీవో నెంబర్ 30 ని జనవరి 2025 నెలలో ఇచ్చిన ప్రకారం మొదటి సారి మంత్రి నారా లోకేష్ నియోజకవర్గం మంగళగిరి లో ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందని, రెండవ సారి కర్నూలులో ఇళ్ల పట్టాలు ఇచ్చి రికార్డ్ సృష్టించడం జరిగిందని మంత్రి తెలియజేశారు.దీనిని ఇంత త్వరగా కార్యరూపంలో పెట్టడం వెనక కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ బి.నవ్య,ఆర్డిఓ తహసీల్దార్ల కృషి ఉన్నదని వారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నారని తెలిపారు. ఇప్పుడు మీకు కాలువలు, కరెంటు ట్రాన్స్ఫార్మర్లు, కరెంటు స్తంభాలు, రోడ్లు మున్సిపాలిటీ వారి ద్వారా ఏర్పాటు చేస్తామని మంత్రి తెలియజేశారు. ప్రజలు గత ప్రభుత్వ హయాంలో ఐదు సంవత్సరాలు చాలా కష్టాలు, నష్టాలు అనుభవించారని దానిని గుర్తుపెట్టుకుని 164 సీట్లతో మా ప్రభుత్వాము ఏర్పాటుకు మద్దతు ఇచ్చి వారికి బుద్ధి చెప్పారని తెలియజేశారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు సూపర్ సిక్స్ పథకాలు కూడా అమలు చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఆగస్టు 15న మహిళలందరికీ రాష్ట్రమంతా తిరగే వెసులు బాటుతో ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని మంత్రి తెలియజేశారు. టిడ్కో గృహాలను ఈ సంవత్సరం చివరకు ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని, జగన్నాథ్ గట్టు లో గల ఇండ్లను కూడా అందుబాటులోకి తెస్తామని, అలాగే టీవీ9 కాలనీ ఇండ్లు మరియు కర్నూలు నగరంలో చాలా సంవత్సరాలుగా నివాసాలు ఉంటున్న వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామని ఈ సందర్భంగా మంత్రి టి.జి. భరత్ తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ మంత్రి భరత్ గారు జీవో 30 వచ్చినప్పటినుండి ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ 40 సంవత్సరముల నుండి నివాసం ఉంటున్న గూడెం కొట్టాల వాసులకు ఈ సంవత్సరం జనవరి లో ఇచ్చిన జీవో 30 ప్రకారం వారికి ఇళ్లపట్టాలను అందించే చర్యలు చేపట్టేందుకు తీవ్రంగా కృషిచేసి మాకు అన్ని విధాల సహకరించి ఈరోజు 150 మందికి ఇళ్ల పట్టాలను మంజూరు చేయించారని రేపటినుండి ఆ స్థలాలు మీ సొంతమని జిల్లా కలెక్టర్ లబ్ధిదారులకు తెలియజేశారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య మాట్లాడుతూ జీవో నెంబర్ 30 ప్రకారం గూడెం కొట్టాలలో 150 మందికి ప్రస్తుతం రెవెన్యూ పట్టాలు ఇస్తున్నామని ఆ తర్వాత రిజిస్టర్ పట్టాలు అందజేస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మక్తుమ్ బీ మరియు హుస్సేన్ బీ మాట్లాడుతూ...

మేము గత 40 సంవత్సరాలు నుండి ప్రతి ప్రజా ప్రతినిధిని ఇళ్ల పట్టాలు ఇవ్వండి అని వేడుకున్నాము కానీ ఎవరు మాకు న్యాయం చేయలేదు. యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ గారు వాగ్దానం చేశారు, ఇప్పుడు మంత్రి టి. జి.భరత్ గారు మరియు అధికారులు మాకు న్యాయం చేశారని మంత్రికి, అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా 150 మందికి మంత్రి అధికారుల చేతులు మీదుగా ఇళ్ల పట్టాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ సమావేశానికి ఆర్డిఓ సందీప్ కుమార్, కల్లూరు తహసీల్దారు ఆంజనేయులు, మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ విశ్వేశ్వర్ రెడ్డి, స్థానిక నాయకులు గూడెం రాజశేఖర్, మనోజ్ ప్రజలు పాల్గొన్నారు.

## పి4 కార్యక్రమం ద్వారా బంగారు కుటుంబాలకు అవసరమైన తోడ్పాటు : జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియాలి





**నంద్యాల, పెన్ పవర్ ఆగస్టు, 05 :** ఆగస్టు 19 నుంచి పి4 అమలుకు ప్రభుత్వ నిర్ణయించడం జరిగింది. పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ప్రవేశపెట్టిన పి4 (ప్రభుత్వ- ప్రైవేటు- ప్రజల-భాగస్వామ్యం) కార్యక్రమం ద్వారా బంగారు కుటుంబాలకు మెరుగైన తోడ్పాటు ఇచ్చేందుకు ఉద్యమ స్ఫూర్తితో ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి పి4 (ప్రభుత్వ- ప్రైవేటు- ప్రజల-భాగస్వామ్యం) కార్యక్రమంపై మంత్రులు, జిల్లా కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా మాట్లాడుతూ.... రాష్ట్రాన్ని ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లడానికి పి4 (ప్రభుత్వ-ప్రైవేటు-ప్రజల-భాగస్వామ్యం) కార్యక్రమాన్ని వినూత్నంగా రూపొందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో మార్గదర్శులుగా నమోదైన వారు బంగారు కుటుంబాల అవసరాల మేరకు చేయూతను ఇవ్వడం ద్వారా వారు జీవితంలో ఇంకా ముందుకు రాణించే అవకాశం ఉంటుందన్నారు. ఇందులో భాగంగా 250 మంది బంగారు కుటుంబాలకు చేయూత ఇవ్వడానికి తాను కూడా మార్గదర్శిగా నమోదు కావడం జరిగిందన్నారు. ప్రస్తుత ప్రపంచంలో తలసరి ఆదాయంలో తెలుగు వారు ప్రథమంగా ఉన్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆగస్టు 19 నుంచి పి4 అమలుకు నిర్ణయించడం జరిగిందని ఇందుకు సంబంధించి మార్గదర్శకాలను, విధివిధానాలపై ఒక బుక్లెట్ రూపొందించడం జరిగిందన్నారు. ఆగస్టు 15వ తేది నాటికి పి4 కార్యక్రమం ద్వారా బంగారు కుటుంబాలకు మార్గదర్శులుగా అనుసంధానం చేయడం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ అంశాలలో తీసుకోవాల్సిన కార్యాచరణపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకు జిల్లాలో ఆగస్టు 19 నుంచి పి4 అమలును ఒక ఉద్యమ స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్లాలన్నారు. జిల్లాలో పేదరిక నిర్మూలన కోసం బంగారు కుటుంబాలుగా నమోదైన వారికి చేయూతను ఇవ్వడం కోసం ఆగస్టు 15లోగా మార్గదర్శకుల నమోదు పూర్తి చేయాలన్నారు. బంగారు కుటుంబాలను ఆదుకోవడంలో మార్గదర్శుల ఎంపిక పూర్తిగా వాలంటీర్ గానే జరగాలన్నారు. ఎవరిని బలవంతం చేయవద్దని... సహాయం చేయాలనే మనసున్న సమయం లేని వారు ఉంటారని, మనసున్న వారు, మానవత్వం కలిగిన అలాంటి వారిని గుర్తించి పి4 వేదిక ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం వివిధ అంశాలలో పలు సూచనలను జారీ చేశారు. కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లాఅధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలు శ్రీ స్వామి నారాయణ గురుకులం ఏర్పాటు


– జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా





**కర్నూలు, పెన్ పవర్ ఆగస్టు 05 :** కర్నూలు జిల్లాలో ప్రతిష్టాత్మక శ్రీ స్వామి నారాయణ గురుకులం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్ లోని క్యాంపు కార్యాలయంలో శ్రీ స్వామి నారాయణ గురుకులం ట్రస్ట్ ప్రతినిధులు సుఖ్ వల్లభ్ స్వామి, సద్గుణ్ ప్రియ్ స్వామి జిల్లా కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మక విద్యా సంస్థ శ్రీ స్వామి నారాయణ గురుకులం ను జిల్లాలో ఏర్పాటు చేసేందుకు భూమిని పరిశీలించడం జరిగిందని తెలిపారు.. దిన్నె దేవరపాడు పరిధిలోని ట్రిబుల్ ఐటీ డిఎం దగ్గర, కల్లూరు మండలం లక్ష్మీపురం దగ్గర, ఎమ్మిగనూరు మండలంలోని బనవాసి దగ్గర గురుకులం ఏర్పాటు చేసేందుకు భూమిని పరిశీలించామని కలెక్టర్ తెలిపారు. కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, కర్నూలు రూరల్ తహసీల్దార్ రమేష్, కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు సంస్థ ప్రతినిధులతో కలిసి స్థల పరిశీలన చేశారు.

## పి4 కార్యక్రమాలపై ముఖ్యమంత్రి సమీక్ష






**కర్నూలు పెన్ పవర్ ఆగస్టు 5 :** రాష్ట్ర సచివాలయం నుండి పి4 పాలసీపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, సంబంధిత శాఖల అధికారులు.

## జిల్లాలో మిషన్ వాత్సల్య కింద 21 మందికి సహకారం : జిల్లా కలెక్టర్



**చిత్తూరు, పెన్ పవర్ ఆగస్టు 05 :** కోవిడ్ మహమ్మారి బారినపడి తల్లి దండ్రులను కోల్పోయిన పిల్లలకు భరోసా కల్పించేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మిషన్ వాత్సల్య కార్యక్రమాన్ని చేపట్టి అమలు చేస్తున్నాయని, బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయం లోని సమావేశ మందిరం లో మిషన్ వాత్సల్యలో భాగంగా బాధితులు వారి సంరక్షకులతో జిల్లా కలెక్టర్ ఐసిడిఎస్ పిడి, వెంకటేశ్వరితో కలసి సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కోవిడ్ మహమ్మారి కారణంగా తల్లిదండ్రులు ఇరువురినీ కోల్పోయిన 21 మంది పిల్లలకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందని, వీరికి ఒక్కొకరికీ కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల నుండి రూ.20 లక్షలు ఆర్థిక సహాయం అందించడం జరిగిందని తెలిపారు. మిషన్ వాత్సల్య ద్వారా బాధిత పిల్లల ఆరోగ్యం, విద్య, తదితర అంశాల పై శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన లోటు తీర్చలేనిదని, కష్టాలను అధిగమించి ముందుకు వెళితే భవిష్యత్తు బాగుంటుందన్నారు. బాధితుల సంరక్షకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎటువంటి సహకారం కావాలన్నా ప్రభుత్వానికి నివేదించి సహకారం అందిస్తామన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే ఐ సి డి ఎస్ అధికారులను, జిల్లా కలెక్టర్ ను కలవవచ్చన్నారు. బాధితుల సాధికారతకు ప్రభుత్వం తోడుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నగదు జమ చేసిన పోస్ట్ ఆఫీసు పాస్ బుక్‌లను బాధితులకు అందజేశారు. ప్రభుత్వం అందించిన సహకారంతో బాగా చదువుకొని ప్రయోజకులు కావాలని తెలిపారు.

## బాల్య వివాహాలను అరికట్టాలి : జిల్లా కలెక్టర్



**చిత్తూరు, పెన్ పవర్ ఆగస్టు 05 :** జిల్లాలో మిషన్ వాత్సల్య లో భాగంగా 18 సంవత్సరాల లోపు పిల్లల రక్షణ సంక్షేమం ప్రణాళిక ప్రకారం అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయం లోని సమావేశ మందిరంలో మిషన్ వాత్సల్య పథకం కింద జిల్లా స్థాయి పిల్లల సంరక్షణ, సంక్షేమ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్ పి మణికంఠ చందోలు, ఐ సి డి ఎస్ పి డి వెంకటేశ్వరి, జెడ్ పి సిఈఓ రవి కుమార్ నాయుడు, డి ఈ ఓ బి.వరలక్ష్మి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనాథ పిల్లలు, చైల్డ్ లేబర్, భిక్షాటన చేస్తున్న పిల్లలను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించాలన్నారు. ఆగస్టు నుండి ప్రతి నెల పిల్లల అపహరణ, అత్యాచారాలు, వేదింపులకు సంబంధించి వివరాలను అందించాలన్నారు. జిల్లాలో 8 నుండి 10 శాతం చైల్డ్ ప్రెగ్నెన్సీ కేసులు నమోదవుతున్నాయని, అబార్షన్ లు జరుగుతున్నాయని తెలిపారు. బేటి బచావో – బేటి పడావో కార్యక్రమం ద్వారా సమస్యాత్మక ప్రాంతాల్లో ఎం ఎస్ కే ల ద్వారా అవగాహన చర్యలు చేపట్టాలని, బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ హాస్టళ్లను అధికారులు స్వయంగా తనిఖీ చేసి పిల్లల సమస్యలను తెలుసుకోవాలన్నారు. ఈ తనిఖీల్లో భాగంగా విద్యార్థులు వారి ఇంటి వద్ద, పాఠశాలలో, హాస్టళ్లలో ఎదుర్కొంటున్న సమస్యలను చాకచక్యంగా అడిగి తెలుసుకోవాలన్నారు. పోలీస్, రెవెన్యూ, ప్రైవేట్ సంక్షేమ సంస్థల ద్వారా రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. సమస్య పరిష్కారంలో భాగంగా సమస్య జరిగిన ప్రదేశాలను గుర్తించి వారి కుటుంబాల దగ్గరకు వెళ్ళి కౌన్సెలింగ్ ఇవ్వడం, అత్యవసరమైన అన్ని సహాయక చర్యలు చేపట్టాలన్నారు. అత్యవసర వైద్యం, ఆవాసం వంటి ఖర్చులను ప్రభుత్వం నుండి భరించడం జరుగుతుందన్నారు. జిల్లా ఎస్ పి మాట్లాడుతూ పోక్సో, అత్యాచార బాధితుల కుటుంబాలలో ధైర్యం నింపడం నైతిక బాధ్యత తీసుకోవాలని తెలిపారు.

## ప్రభుత్వ ఆదేశాల మేరకు...
## యువతకు నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు నిర్వహించండి

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల, పెన్ పవర్ ఆగస్టు, 05 :** ఉత్పాదన, సేవా రంగాల్లోని 35 యూనిట్లకు మొత్తంగా రూ. 121.44 లక్షల విలువైన రాయితీ ప్రయోజనాలను మంజూరు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పారిశ్రామిక మరియు ఎగుమతుల ప్రమోషన్ కమిటీ మరియు జిల్లా నైపుణ్య అభివృద్ధి కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహం కొరకు రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి రాయితీ, పావలావడ్డీ, విద్యుత్, సేల్ టాక్స్ తదితరాలలో రాయితీ ప్రయోజనాలు కల్పిస్తోందన్నారు. గత త్రైమాస కాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోసం 139 దరఖాస్తులు అందగా, సింగిల్ డెస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 131 పరిశ్రమలకు అనుమతులు మంజూరు అయ్యాయని, ఇంకను 8 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, వాటిని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ క్రింద చేపడుతున్న సర్వేను కూడా త్వరగా పూర్తి చేసేలా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ర్యాంప్ కార్యక్రమం ద్వారా సూక్ష్మ చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల పెంపుదలకు రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ద్వారా పరిశ్రమల స్థాపనకు యువ పారిశ్రామికవేత్తలు, మండలాల్లోని యువత ముందుకు వచ్చేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. నైపుణ్య అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాల మేరకు జిల్లాలో స్కిల్ హబ్స్, ఈఎస్ఈలలో జాబ్ మేళాలు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎంత మంది యువత నైపుణ్య శిక్షణను పొందుతున్నారన్న అంశాన్ని నైపుణ్యం వెబ్సైట్ లో కలెక్టర్ పరిశీలించి, ప్రగతి సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా 2025లో నిర్వహించే జాబ్ మేళా బ్రోచర్లను అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం ఎస్.మహబూబ్ బాషా, నైపుణ్య అభివృద్ధి శిక్షణా అధికారి శ్రీకాంత్ రెడ్డి, డిఆర్డిఎ పిడి శ్రీధర్ రెడ్డి, పరిశ్రమల శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ రెడ్డి, ఐటిడిఎ పిఓ వెంకట శివప్రసాద్, ఎల్డీఎం రవీందర్ కుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిషోర్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు రాజమహేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.


## పకడ్బందీగా జడ్పిటిసి ఉప ఎన్నికల నిర్వహణ
### – జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి





**వైయస్సార్ కడప పెన్ పవర్ ఆగస్టు 5 :** పులివెందుల ఒంటిమిట్ట జడ్పిటిసి ఉప ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని బోర్డ్ రూమ్ హాల్ నందు పులివెందుల,ఒంటిమిట్ట జడ్పిటిసి ఉప ఎన్నికల నిర్వహణ ఏర్పాట్ల పై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, ఎస్పీ అశోక్ కుమార్లతో కలసి జెడ్పి సీఈవో ,ఆర్వోలు, ఏఆర్వోలు నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ... జడ్పిటిసి ఉప ఎన్నికలను పకడ్బందీగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. పోలింగ్ స్టేషన్ల మౌలిక వసతులు,మాన్ పవర్ ,ట్రైనింగ్ ప్రోగ్రామ్స్, సెక్యూరిటీ అరేంజ్మెంట్స్ ,జిల్లా చెక్ పోస్టులు,కమ్యూనికేషన్ ప్లాన్స్, పోలింగ్ అధికారులు, పోలింగ్ రూట్స్,వెహికల్ రిక్వైర్మెంట్స్,పోలీస్ ఫోర్స్ ,చెక్ లిస్ట్, మెటీరియల్, స్వస్తిక్ గుర్తులు తదితర అంశాల కార్యాచరణపై.. అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలింగ్ స్టేషన్ల వద్ద వెబ్ కాస్టింగ్,మొబైల్ కనెక్టివిటీ వంటి సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఈ మండలాల పరిధిలోని సెల్సిటివ్, క్రిటికల్, వల్నరబిలిటీ పోలీస్ స్టేషన్ల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే జడ్పిటిసి ఉప ఎన్నికలకు సంబంధించి నోడల్ అధికారులకు విధులను కేటాయించడం జరిగిందన్నారు.అన్ని పోలింగ్ స్టేషను పరిశీలించాలన్నారు. ఎంసీసీ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నియమ నిబంధాలను పక్కగా అమలు చేయాలన్నారు. బ్యాలెట్ బాక్సులు,మెటీరియల్ ట్రాన్స్పోర్ట్ పక్కగా నిర్వహించాలన్నారు. వెబ్ కాస్టింగ్ నిర్వహణ బాధ్యత గా చేయాలన్నారు. వృద్ధులకు ర్యాంప్ లు, వికలాంగులకు వీల్ చైర్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు ఆగస్టు 6 న నలుగురు రిసోర్స్ పర్సన్స్ తో ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని తెలిపారు. త్రాగునీరు,భోజన ఏర్పాట్లు పక్కగా ఏర్పాటు చేయాలన్నారు.ఉప ఎన్నికలు జరిగే మండలాల పరిధిలో ఎఫెస్టీ,ఎస్టీలు,ఫ్లైయింగ్ స్క్వార్డ్ లు బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. పులివెందుల స్థానానికి సంబంధించి 12 నామినేషన్లు, ఒంటిమిట్ట స్థానానికి సంబంధించి 21 నామినేషన్లు రాగా ఆగస్టు 5వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోపు నామినేషన్ల ఉపసంహరణ తరువాత పులివెందుల స్థానానికి సంబంధించి 11 నామినేషన్లు, ఒంటిమిట్ట స్థానానికి సంబంధించి 11 నామినేషన్లతో తుది జాబితా వెల్లడైందన్నారు. ఎస్పీ మాట్లాడుతూ....జిల్లా పరిధిలో 12 చెక్ పోస్టు ,సెల్సిటివ్, క్రిటికల్, వల్నరబిలిటీ పోలీస్ స్టేషన్ల వద్ద గట్టి బందోబస్త్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇంటింటి కాంపెయిన్ లో బాగంగా ఆర్మర్డ్ ఫోర్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నైట్ పెట్రోలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో డి.ఎస్.పి వెంకటేశ్వర్లు, పులివెందుల ఏఆర్ఓ కృష్ణమూర్తి, ఒంటిమిట్ట ఏఆర్ఓ సుజాతమ్మ, నోడల్ అధికారులు, తహసిల్దారులు, తదితరులు పాల్గొన్నారు.

# గురుదక్షిణ... వ్యక్తి యొక్క అంగీకారం...
### – సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి కడప హెచ్ఎఫ్ఎన్









**కడప పెన్ పవర్ ఆగస్టు 5 :** భూమా ఎవరు? ఆ భూమా ఎక్కడ ఉంటుంది? ఎలా ఉంటుందో! ఇవన్నీ కొత్తగా చేరిన అభ్యాసీలకు కలిగే అనుమానాలు. ఐనా, సాధన మొదలుపెట్టిన కొంత కాలం తర్వాత ఒక్కొక్కటిగా అవగాహన లోకి వస్తుంది. అభ్యాసీలకు అర్థం కాని విషయం మాత్రం ఒకటుంది. అదే మన బాబూజీ గురించి. ఆయనను ప్రత్యక్షంగా చూసిన అదృష్టవంతులు కొద్దిమందే. ఆ చూసిన వారిలో కూడా ఆయన గురించి తెలిసింది చాలా కొద్దిమందికి మాత్రమే. బాబూజీ ఒకసారి ఎవరితోనో మాట్లాడుతూ, ఇలా అన్నారు. "చూడండి! ఎందరో వస్తారు. కానీ నన్ను చూడకుండానే వెళ్ళిపోతారు." అనేవారు బాధతో. అసలు బాబూజీ ఎవరు? ఆయన మనకోసం ఎంతో చేశారు. కానీ ఆయనేమిటో ఎవరికీ అర్థం చేసుకునే పరిజ్ఞానం లేకుండా పోయింది. బాబూజీకి ఒక గురువు ఉండేవారు. ఆయన పేరు శ్రీ రామచంద్రజీ. కానీ ఆయన సన్నిహితులందరూ ఆయనను లాలాజీ సాహెబ్ అని పిలుస్తారు. లాలాజీ ఒక గొప్ప యోగి. వారు బాబూజీకి గురువయ్యారు. లాలాజీ సాహెబ్ జీవించిన కాలం కేవలం 58 సంవత్సరాలే. ఐనా ఆయన తన జీవిత కాలంలో అద్భుతాలు సృష్టించారు. ఆయన ఏడు నెలల కఠోర సాధనతో భూమాని ప్రసన్నం చేసుకున్నారు. అందుకు బదులుగా భూమా బాబూజీ మహరాజ్ ను వరంగా ప్రసాదించింది .బాబూజీ నిజానికి భూమా యొక్క అంశ. లాలాజీ సాహెబ్ యొక్క ముఖ్యమైన పని బాబూజీని ఈ భూమి పైకి తీసుకు రావడమే. అది పూర్తయిన కొంత కాలానికి ఆయన జీవిత కాలం ముగిసింది. లాలాజీ అనేక పరిశోధనలు చేసి రాజయోగ సాధనలో కొన్ని విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చారు. అవి ప్రస్తుత మానవాళి జీవన సరళికి సరిపోయే విధంగా మార్చబడ్డాయి. లాలాజీ యొక్క పూజ్య గురుదేవులకు ఒక ఆలోచన వచ్చింది. ఎందరో మహానుభావులు, గొప్ప గొప్ప ఋషులు వేల సంవత్సరాల తపస్సు చేసి కూడా ఆ భూమా శక్తిని భూమి పైకి తేలేక పోయారు. తనకా వయసు అయిపోయింది. భూమాను భూమి పైకి తీసుకు రావాలనే ప్రగాఢమైన తపన ఉన్నా, ఆయన ఆ పని మాత్రం చేయలేక పోయారు. ఆయన తీవ్రంగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చారు. తన శిష్యులలో ఒక యోగ్యుడైన ఒక వ్యక్తిని ఈ పనికి నియోగించాలని నిర్ణయించారు.

అందుకు మేలైన వ్యక్తి లాలాజీ మాత్రమే అని ఆయన ఒక నిర్ణయానికి వచ్చారు. వెంటనే ఆయన లాలాజీ సాహెబ్ కి ఈ సాధన ఒప్పచెప్పారు. ఆయన ఎంతో కష్టమైన సాధనతో ఏడు నెలలు తీవ్రంగా కృషి చేసి బాబూజీ వంటి మహాత్ముడిని ఈ భూమిపైకి తీసుకు వచ్చారు. బాబూజీ 1899 వ సంవత్సరంలో జన్మించారు. లాలాజీ తదనంతరం బాబూజీ ఈ సాధనలో గురువుగా ఎన్నికయ్యారు. బాబూజీ తన హయాంలో అనేక విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. ఈ యోగ సాధనకు సహజ మార్గ సాధనగా పేరు పెట్టి తన గురువు గారి పేరు మీద శ్రీ రామచంద్రా మిషన్ అనే సంస్థను మనుగడలోకి తీసుకు వచ్చారు. ఈ యోగ సాధనలో ఎక్కువ కష్టపడాల్సిన అవసరం లేకుండానే ఉత్తమ లక్ష్యాలను సులభంగా సాధించవచ్చు. ఈ సాధన గృహస్థుల సాధనకు అనుకూలమైనది. గృహస్థులు కానివారు కూడా ఈ సాధనకు అర్హులు. ఈ యోగ సాధన చాలా సులభమైనది. గురువు చూపిన మార్గంలో నడుస్తూ వారి మార్గదర్శకత్వంలో సాధన చేస్తూ ఆధ్యాత్మికంగా ఉత్తమ స్థితులు పొందే అవకాశం ఈ సాధన లో ఉంది. అభ్యాసకుడు గురువునే సర్వస్వంగా భావించి ఆయన ప్రేమలో మునిగి, సర్వస్వం ఆయనకు సమర్పణ చేసి సాధన కొనసాగించాలి. ఇందుకు గురువుకు గురుదక్షిణగా మీ హృదయాన్ని మాత్రమే సమర్పించి సాధనలో ముందుకు సాగుతారు. అందుకు మూల్యంగా గురువు నీ నుండి ఏమీ ఆశించరు. వ్యక్తి యొక్క అంగీకారమే వారు కోరే మూల్యం. మిగతా సంస్థలలో గురువుకు దక్షిణగా కొంత మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. అలాగే గురువుకు తనవంతు శుశ్రూషని ఇవ్వవలసి ఉంటుంది. కానీ ఇక్కడ అటువంటివి ఉండవు. ఇందుకు ప్రవేశం ఉచితం. అంగీకారం ఒక్కటి సరిపోతుంది.

సర్వే జనాః.
సుఖినోభవంతు"




## జిల్లాలో తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి
### జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా




**కర్నూలు, పెన్ పవర్ ఆగస్టు 05 :** జిల్లాలో తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. మంగళవారం ఓర్వకల్లు మండలంలోని కాల్వ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఓవర్ హెడ్ స్టోరేజ్ ట్యాంక్ లకు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో త్రాగునీటి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.గ్రామాల్లో జిల్లా పరిషత్, మండల పరిషత్, పంచాయతీ నిధులను వినియోగించి తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు.. కాల్వ గ్రామంలో జల్ జీవన్ మిషన్ గ్రాంట్ కింద కోటి 12 లక్షల రూపాయల వ్యయంతో 90 కిలో లీటర్లు, 40 కిలో లీటర్లు కెపాసిటీ కలిగిన రెండు ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ లను నిర్మించడం జరుగుతోందన్నారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి కాల్వ గ్రామ ప్రజలకు తాగు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలి : ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ శర్మ

**అనంతపురం , పెన్ పవర్ ఆగస్టు 5 :** జిల్లాలో గ్రామ మరియు వార్డు సచివాలయాల అంశాలకు సంబంధించి పెండింగ్ లో ఉన్న పనులను సత్వరమే పూర్తి చేయాలని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో పంచాయతీ సెక్టార్, జిఎస్ డబ్ల్యూ ఎస్, తదితర అంశాలపై డిపిఓ, డిఎల్డిఓలు, మరియు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఈవో ఆర్డీలు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ జిల్లాలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, వార్డుసచివాలయలకుసంబంధించినఅంశాలలో ఎలాంటిఅలసత్వంప్రదర్శించకుండాపారదర్శకంగాప్రాధాన్యత కల్పించి పెండింగ్ లేకుండా వాటిని వెంటనేపూర్తిచేయాలని ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ సిటిజన్ ఫీడ్ బ్యాక్ను నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని సూచించారు. ఆయా సచివాలయాల్లో దీనికి సంబంధించిన క్యూఆర్ కోడ్ పెట్టాలని ప్రజల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతిరోజు ఈఅంశాలపై పురోగతిని సాధించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే క్షేత్రస్థాయిలో సరిగా విధులు నిర్వర్తించని వారిపై చర్యలు తీసుకోవాలని హెచ్చరికను జారీ చేశారు. అలాగే నెగటివ్ ఫీడ్ బ్యాక్




ఉన్న మండలాలను గుర్తించి ఆయా ఎంపీడీవోలకు డిప్యూటీ ఎంపీడీవోలకు మెమోలు జారీ చేయాలనిఆదేశించారు. ఇలాంటి ఫీడ్బ్యాక్ ఉన్న మండలాల పై సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధతీసుకొని లక్ష్యసాధనకుకృషి చేయాలనిసూచించారు.

ముఖ్యంగా తల్లికి వందనం, ఈకేవైసీ సంబంధించి మదర్ మరియు చైల్డ్ ఈ కేవైసీ పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని, తల్లికి వందనం గ్రీవెన్స్ పెండింగ్ లో ఉన్న వాటిని వీలైనంత త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఏపీ సేవా సర్వీసెస్ డాష్ బోర్డు మనమిత్ర క్యాంపెయిన్లో పెండింగ్ పనులను రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సిటిజన్ ఈ కేవైసీ ఆధార్ సీడింగ్ ఫర్ వాహన్ డేటా పెండింగ్ ను కూడా వేగంగా చేపట్టాలని, సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్ కచ్చితంగా 100% నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హౌసింగ్ ద్వారా గృహప్రవేశాల ప్రక్రియతో పాటు స్వమిత్ర గ్రామసభల నిర్వహణ తదితర వాటి అమలులో పెండింగ్ ఉన్న మండలాల్లో పనులు వేగవంతం చేయాలని సూచించారు.

ఎస్ డబ్ల్యూ పిసి షెడ్లనుఅన్నిచోట్లపనిచేస్తున్నాయా లేదా గుర్తించే విధంగాఅని క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చర్యలు చేపట్టాలని షెడ్లు లేని గ్రామాల్లో వాటిని ఏర్పాటు చేయడంపై ప్రత్యేక దృష్టిని సారించాలని తెలిపారు. ప్రభుత్వం అయ్యే ఆర్ ఎస్ కాల్స్ ద్వారా సేవలు గురించి ప్రజల నుండి ఫీడ్ బ్యాక్ స్వీకరించే అంశంలో నిర్లక్ష్యం చేయరాదని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇంటింటి చెత్తసేకరణలో పలు మండలాల్లో చాలా వరకు ఎక్కువగా నెగటివ్ రావడం జరిగిందని భవిష్యత్తులో అలాంటివి జరగకుండాచర్యలుతీసుకోవాలని ఇన్చార్జ్ జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమస్య సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ సహార్ జడ్పీ సీఈఓ శివశంకర్, డిపిఓ నాగరాజు నాయుడు, హౌసింగ్ పీడీ శైలజ, సిపిఓ అశోక్, జిఎస్డబ్ల్యూ జిల్లా కోఆర్డినేటర్ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యాన్ని సాధించడంలో వేసే మన చిన్న అడుగులు
### - ఎంత పెద్ద పాత్ర పోషిస్తాయో ఆలోచించామా? :సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి... అభ్యాసి





**కన్హ పెన్ పవర్ ఆగస్టు 5 :** జాదవ్ పాయెంగ్ (భారతదేశంలోని ఒక అటవీ నివాసి) జాదవ్ పయెంగ్ యొక్క ఈ ఆత్మకథ నిజంగా ఆసక్తికరంగా, స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. జీవితంలో అసాధ్యం అంటూ ఏదీ లేదని మనకు తెలియజేస్తుంది. జాదవ్ పయెంగ్ 60 ఏళ్ల రైతు. ఐదుగురు సభ్యులున్న కుటుంబం అతనిది, ఈశాన్య భారతదేశంలో నిరాడంబరమైన ఇంట్లో నివసిస్తున్నాడు. కానీ అతను ఒంటరిగా చేసినదేమిటో తెలిస్తే మీరు చాలా ఆశ్చర్యపోతారు. ఇది మనకు స్ఫూర్తిదాయకమే అయినా, రాబోయే తరాలు కూడా అతని నుండి చాలా నేర్చుకోవచ్చు. ఓ జర్నలిస్టుకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన జీవిత విశేషాలను ఆయన పంచుకున్నాడు. విలేఖరితో ఇలా చెప్పాడు, "ప్రస్తుతం మనం కూర్చున్న ఈ ప్రదేశాన్ని మోఘోర్ ఖుంటి (పశువుల కొట్టం) అని పిలుస్తారు. ఈ ప్రదేశం చారిత్రాత్మకంగా చాలా ప్రముఖమైనది. 1826 లో, బర్మాకు, బ్రిటిష్ వారికి మధ్య మహాయుద్ధం (మొదటి బర్మా యుద్ధం అని కూడా పిలుస్తారు), ఇక్కడ జరిగింది. 1965 – 1970 మధ్య, బ్రహ్మపుత్ర నదికి తీవ్రమైన వరద వచ్చి, ఆ వరద ఇక్కడ భయంకరమైన విధ్వంసం సృష్టించింది. ఇక్కడ ప్రతిదీ కొట్టుకుపోయింది. దీని కారణంగా ఇక్కడ 10 కిలోమీటర్ల మేర కోత ఏర్పడి మోఘోర్ ఖుంటి ఒక బంజరు భూమిగా మారిపోయింది. "16 సంవత్సరాల వయస్సులో, కరువు కారణంగా చెట్లు, మొక్కలు, వందలాది పాములు చనిపోతున్నాయని, అడవిని కోల్పోవడం వల్ల జంతువులు పారిపోతున్నాయని, ఆ భూమి నిర్మానుష్యంగా మారి పోతోందని నేను గ్రహించాను." జాదవ్ పయెంగ్ 16 ఏళ్ల ఆ చిన్న వయసులోనే ఏదైనా చేయాలని నిర్ణయించుకున్నాడు.

అతను మొదట ఒక పడవను నిర్మించాడు. ప్రతిరోజూ తన చెట్ల నుండి కొమ్మలను కత్తిరించి, 20 నిమిషాలు నడిచి, ఆపై తను నిర్మించిన పడవలో నదిని దాటి, ఆ తర్వాత మరో రెండు గంటలు నడిచి, ఒక్క చెట్టు కూడా లేని, ఆ ఖాళీ బంజరు భూమికి వెళ్ళేవాడు, అక్కడ అతను ఆ చెట్టు కొమ్మను భూమిలో నాటేవాడు. ఆ స్థలంలో ఒక్కొక్కటిగా మొక్కలు నాటడం ప్రారంభించాడు. ముందుగా వెదురు చెట్టును నాటాడు. మొదట్లో అతనికి పిచ్చి పట్టిందని అందరూ అనుకున్నారు, ఎగతాళి చేయడం మొదలుపెట్టారు. కానీ అవేమీ పట్టించుకోకుండా తన పనిని కొనసాగించాడు. క్రమంగా, అతను ఇతర జాతుల చెట్లను కూడా నాటడం ప్రారంభించాడు. ఇది అతను ఒకటి, రెండు రోజులు, లేదా ఒకటి, రెండు సంవత్సరాలు చేసినది కాదు... నలభై సంవత్సరాల పాటూ అనుసరించిన ప్రక్రియ – ఒక చెట్టు నుండి ఒక కొమ్మను కత్తిరించేవాడు, తరువాత మొదట కాలి నడకన నడిచి, పడవలో నదిని దాటి, మళ్లీ నడిచి ఆ బంజరు భూమికి వెళ్లి చెట్లను నాటేవాడు. క్రమంగా ఆ చెట్లన్నీ ఎదగడం ప్రారంభించి ఆ బంజరు భూమి పచ్చని అడవిగా మారిపోయింది. అతను నాటిన చెట్ల విత్తనాల నుండి, మరిన్ని చెట్లు వాటంతట అవే పెరగడం ప్రారంభించాయి. చాలా సంవత్సరాల తరువాత, ఆ అడవిలో జంతువులు కనిపించడం మొదలయ్యాయి. ఏనుగులు, పులులు, ఖడ్గమృగాలు, జింకలు, అనేక ఇతర వన్యప్రాణులు ఆ అడవి, అక్కడ ఉన్న పచ్చదనం వల్ల ఆకర్షించబడ్డాయి. ఆయన ఇంకా మాట్లాడుతూ.. "చెట్ల వల్ల అక్కడి వాతావరణం కూడా మారిపోవడం మొదలయ్యింది, వ్యవసాయం చేయడం సులభమయ్యింది, దానితోపాటు జీవనోపాధి పొందడం సులువైంది." న్యూయార్క్ సెంట్రల్ పార్క్ కంటే పెద్దదైన ఆ అడవి 550 హెక్టార్లలో విస్తరించి ఉందని తెలిస్తే ఆశ్చర్యం వేస్తుంది. 2010లో జాదవ్ పాయెంగ్ గురించి స్థానిక మీడియాకు తెలియడంతో, క్రమంగా ఈ వార్త దేశమంతా ఒక సంచలనాన్ని కలిగించింది. అతను ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరు పొందాడు. భారత రాష్ట్రపతి ఆయనకు ఫోన్ చేసి అభినందనలు, అవార్డులు అందజేశారు. దేశ విదేశాలలో పర్యావరణం, వాతావరణ మార్పులపై మాట్లాడటానికి అతను ఇప్పుడు ఆహ్వానింపబడుతున్నాడు. ఒక సాధారణ రైతు నుండి లక్షలాది మందికి ఆదర్శంగా నిలిచాడు. 40 సంవత్సరాల తరువాత, అతను ఇప్పటికీ క్రమం తప్పకుండా చెట్లను నాటతాడు, కానీ ఇప్పుడు అతని తదుపరి లక్ష్యం కొంచెం భిన్నమైనది. ఇప్పుడు తన స్నేహితుడితో కలిసి చెట్లను ఎలా నాటాలి అన్నదాని మీద ఒక పుస్తకం రాయాలనుకుంటున్నాడు. పిల్లలకు చిన్నప్పటి నుంచే ప్రకృతి ప్రాధాన్యతపై అవగాహన కల్పించి, చిన్నప్పటి నుంచే విత్తనాలు జల్లడంతో పాటు మొక్కలు నాటడం, పర్యావరణం పట్ల బాధ్యతగా మెలగడంలాంటివి చేస్తే ప్రస్తుత పర్యావరణానికి సంబంధించిన ఎన్నో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అతని అభిప్రాయం. ఈ సందేశాన్ని వీలైనంత ఎక్కువగా వ్యాప్తి చేయాలనుకుంటున్నాడు. ఈరోజు కూడా "నేను ఎప్పటికీ ఆగను" అని అంటాడు. అతను మనందరితో ఒక సందేశాన్ని పంచుకోవాలనుకుంటున్నాడు.... "మనం ఏదైనా మంచి చేసి, చాలా కాలం పాటు ప్రతిరోజూ చిన్న చిన్న అడుగులు వేస్తే, ఏదో ఒక రోజు, మనం ప్రపంచాన్ని మరింత మెరుగ్గా చేసి, మంచిగా మార్చేదేదో, పెద్దది, ఖచ్చితంగా చేస్తాం ...." లక్ష్యాన్ని సాధించే దిశగా వేసే ప్రతీ చిన్న అడుగు, మన సంకల్ప శక్తిని బలపరుస్తుంది.

దాజీజి
హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం
అనువాదబృందం ఆంధ్రప్రదేశ్

# జిల్లాలు మౌనం... వైసీపీలో ఏం జరుగుతోంది ?



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ విపక్షంలోకి వచ్చిన దగ్గర నుంచి నిశ్శబ్దమే తాండవిస్తోంది. పార్టీ అధినాయకత్వం దిశా నిర్దేశం చేస్తూనే ఉంది. కానీ జిల్లాల్లో మాత్రం నాయకులు మౌన వ్రతం పాటిస్తున్నారు. పార్టీ ఆదేశాలను వారు మొక్కుబడిగా తీసుకుంటున్నారు. వైసీపీ అధినాయకత్వం అయితే మొత్తం 26 జిల్లాలకు అధ్యక్షులను నియమించింది. అంతే కాదు పార్టీ కార్యక్రమాలను ఎక్కడికక్కడ ఎవరికి వారే రూపొందించుకోవాలని సూచించింది. స్థానిక సమస్యల ఆధారంగా ప్రజా సమస్యల మీద నిరంతర పోరాటం చేయాలని కోరింది.

**నిరాశగానే సీన్ ఉందా :**
అయితే వైసీపీ అధినాయకత్వం నమ్మి పార్టీ పదవులు అప్పగించినా కూడా చాలా మంది మాత్రం వాటిని అలంకారప్రాయంగా చూస్తున్నారు అని అంటున్నారు. కొన్ని చోట్ల అయితే అధినాయకత్వం రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు పిలుపు ఇచ్చినా వాటిని పెద్దగా చేసేందుకు ముందుకు రాలేదని అంటున్నారు. ఎటు చూసినా నిరాశగానే సన్నివేశం కనిపిస్తోంది అని అంటున్నారు. తమ ప్రాంతాలలో బలంగా ఉన్న కూటమి ప్రభుత్వాని ఎదిరించడానికి వైసీపీ నేతలు సిద్ధంగా లేరని అంటున్నారు. పైగా ఎవరికి వారు సొంత వ్యాపారాలు వ్యవహారాలలో బిజీగా ఉన్నారని అంటున్నారు.

**నివేదికలు చేరాయా :**
జిల్లాలలో పార్టీ పరిస్థితి ఎలా ఉందో అని వైసీపీ అధ్యయనం చేయించిన నివేదికలు ఇపుడు అధినాయకత్వం వద్దకు చేరాయని అంటున్నారు. చాలా చోట్ల అయితే జిల్లాల బాధ్యులు చురుకుగా లేరని క్రియాశీలంగా కనిపించడం లేదని నివేదికల సారాంశంగా ఉంది అని అంటున్నారు. దాంతో క్యాడర్ కూడా నిస్తేజంగా ఉందని చెబుతున్నారు. దీంతో వైసీపీ అధినాయకత్వం పూర్తి స్థాయిలో ఆలోచనలో పడినట్లుగా చెబుతున్నారు.

**పూర్తి స్వేచ్ఛ ఇచ్చినా :**
మీకు మీరే పార్టీ యజమానులు. మీదే పార్టీ అని అధినాయకత్వం స్పష్టంగా చెప్పింది. మీరు పార్టీని ముందుకు తీసుకుని వెళ్ళాలి. కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలలో వ్యతిరేకత ఉంది. దానిని అందిపుచ్చుకోవాలని కూడా సూచించారు. హైకాండ్ వైపు చూడవద్దని పై నుంచి ఆదేశాలు వచ్చేంతవరకూ ఆగవద్దని కూడా స్పష్టంగానే చెప్పారని అంటున్నారు. పార్టీ కమిటీలు అనుబంధ కమిటీలు అన్నీ పూర్తి చేసి ప్రతీ జిల్లాలో పార్టీని ధీటుగా నిలబెట్టాలని హైకమాండ్ కోరుతోంది. కానీ చాలా చోట్ల అయితే ఇవేమీ పెద్దగా జరగలేదని చెబుతున్నారు.

**భారీ మార్పులు ఖాయమా :**
ఈ నేపథ్యంలో నివేదికలను నిశితంగా పరిశీలిస్తున్న హైకమాండ్ భారీ మార్పులకు శ్రీకారం చుట్టబోతోంది అని అంటున్నారు. పార్టీ బాధ్యతల పట్ల పెద్దగా ఆసక్తి లేని వారు చురుకుగా జనంలోకి వెళ్ళలేని వారిని పక్కన పెట్టి అంకితభావంతో పనిచేసే వారికి నిబద్ధతో ఉండేవారికి చోటు కల్పించాలని ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. చాలా జిల్లాల్లో చూస్తే మాజీ మంత్రులు సీనియర్ నేతలకే పార్టీ పగ్గాలు అప్పగించారు. మరి వీరిలో పార్టీ ఆదేశానుసారం పార్టీ నమ్మకం ప్రకారం పనిచేయని వారు ఉంటే కనుక వారిని తప్పించి కొత్తవారికి యువతకు చాన్స్ ఇస్తారని అంటున్నారు.

**గ్రౌండ్ లెవెల్ లో అలా :**
అయితే నాయకత్వాలు ఎంత మార్చినా గ్రౌండ్ లెవెల్ లో రియాలిటీస్ వేరుగా ఉన్నాయని అంటున్నారు. తమ వ్యాపారాలు వ్యవహారాలు వదులుకుని ఎవరూ ముందుకు రాని పరిస్థితి అని అంటున్నారు పైగా కూటమి చేతిలో నాలుగేళ్ళ అధికారం ఉంది. దాంతో ఎదురు నిలిచి గట్టిగా పోరాడితే అనవసర ఇబ్బందులు వస్తాయని భావిస్తున్నారు అని అంటున్నారు. కూటమి ప్రభుత్వం పట్ల అనుకున్నంత వ్యతిరేకత అయితే లేదని కూడా అంటున్నారు. మొత్తానికి చూస్తే వైసీపీలో ఎలా ఉంది అంటే అధినేత జగన్ బయటకు వస్తేనే పార్టీ కనిపిస్తోంది. లేకపోతే గప్ చుప్ అన్నట్లుగానే సీన్ ఉంది అని అంటున్నారు.

# గల్లాకు పెద్ద సీటు గ్యారంటీనా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీలో రెండు సార్లు ఎంపీగా గెలిచారు. బలమైన సామాజిక నేపథ్యం ఉంది. రాజకీయంగా కూడా అంగబలం అర్థబలంతో ఉన్న వారు, వైసీపీ ప్రభంజనంలో సైతం 2019 గెలిచిన వచ్చిన ముగ్గురు ఎంపీలలో ఆయన ఒకరు. ఆయనే గల్లా జయదేవ్. గుంటూరు పార్లమెంట్ సీటు నుంచి 2014, 2019లలో గెలిచిన గల్లా జయదేవ్ 2024లో కూడా సీటు గ్యారంటీ. గెలుపు సైతం గ్యారంటీ. కానీ ఆయన తీసుకున్న ఒక షాకింగ్ డెసిషన్ వల్ల ఈ రోజు రాజకీయ త్రాసులో కిందన ఉండాల్సి వస్తోంది అంటున్నారు.

**సెంట్రల్ మినిస్టర్ జస్ట్ మిస్ :**
ఇదిలా ఉంటే గల్లా జయదేవ్ కి కేంద్ర మంత్రి చాన్స్ జస్ట్ మిస్ అని అంటున్నారు. ఆయన కనుక 2024లో పోటీ చేసి ఉంటే పెమ్మసాని చంద్రశేఖర్ స్థానంలో ఆయనే కేంద్ర మంత్రిగా అయి ఉండేవారు అని అంటున్నారు. కానీ రాజకీయంగా లక్ ని ఆయన అలా జార్చుకున్నారు అన చర్చ అయితే ఉంది. ఇవన్నీ పక్కన పెడితే గల్లా జయదేవ్ పొలిటికల్ గా రీ ఎంట్రీ కోసం చూస్తున్నారు అన వార్తా కథనాలు వినిపిస్తున్నాయి

**మనసు మార్చుకున్నారా :**
ఆయన 2024 ఎన్నికల్లో పోటీ చేయను అని ఎన్నికల ముందు ఒక నిర్ణయం తీసుకున్నారు రాజకీయాలకు దూరం అని ప్రకటించారు. దాంతో చాలా మంది ఆశ్చర్యపోయారు. మంచి పొలిటికల్ కెరీర్ ని ఆయన వదిలేసుకుంటున్నారు అని కూడా అనుకున్నారు. మరో వైపు చూస్తే పరిశ్రమలు వ్యాపారాల గురించి ఆలోచించి ఆయన ఈ విధంగా డెసిషన్ కి వచ్చారు అని అంటున్నారు. దాంతో పాటు గత వైసీపీ ప్రభుత్వం తో వెక్స్ అయిపోయి ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు అని అంటున్నారు.

**తప్పకుండా వస్తున్నారా :**
అయితే తాజాగా మీడియా కంటబడ్డారు. ఈ సందర్భంగా తన మనసులో మాటను బయటపెట్టారు. తప్పకుండా రాజకీయాల్లో రీ ఎంట్రీ ఉంటుందని కూడా స్పష్టం చేశారు. పార్టీ పెద్దలతో చర్చిస్తున్నాను అన్నారు. అంటే టీడీపీ పెద్దలు ఆయన రాకకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు అని ప్రచారం సాగుతోంది. బలమైన రాజకీయ నేపథ్యం కలిగిన గల్లా కుటుంబం కనుక ఆయన మరోసారి తన రాజకీయ ఆసక్తిని ప్రదర్శిస్తే టీడీపీ పెద్దలు సుముఖంగానే ఉంటారు అని అంటున్నారు.

**పెద్దల సభకేనా :**
ఇక రాజ్యసభ సీటు మీద గల్లా జయదేవ్ ఫోకస్ పెట్టారు అని అంటున్నారు. 2026లో ఏపీ నుంచి నాలుగు రాజ్యసభ సీట్లు ఖాళీ అవుతున్నాయి. అందులో నుంచి ఒక దానిని ఆయన ఆశిస్తున్నారు. రెండు సార్లు ఎంపీగా లోక్ సభకు పనిచేసిన అనుభవం తో పాటు వివాదరహితునిగా ఉండడం ఆయనకు కలసి వచ్చే విషయంగా చెబుతున్నారు. అదే విధంగా సూపర్ స్టార్ క్రిష్ణ కుటుంబానికి చెందిన వారు కాబట్టి కూడా ఆయనకు టీడీపీలో ప్రత్యేక స్థానం ఉంటుందని చెబుతున్నారు. దాంతో గల్లా జయదేవ్ మరోసారి పార్లమెంట్ లో పెద్దల సభలో కనిపించే చాన్స్ తప్పకుండా ఉంటుందని అంటున్నారు.

# వేగంగా తిరుగుతున్న భూమి.. అదే జరిగితే అనర్థం తప్పదు అంటున్న శాస్త్రవేత్తలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** మానవ కార్యకలాపాల వల్ల వాతావరణంలో ఎన్నో మార్పులు సంభవిస్తున్నాయి. ఇప్పటికే ప్లాస్టిక్ వాడకం వంటి వాటి వల్ల ఓజోన్ పొర దెబ్బతినడం, వాతావరణంలో భయంకరమైన మార్పులు రావడం, సునామీలు, భూకంపాలు మనం చూస్తూనే ఉన్నాం. అయితే తాజాగా మరో విషయం అందర్నీ భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఇది చూస్తూ ఉంటే ఏదో ఊహించనిది జరగబోతోందని శాస్త్రవేత్తలు ఆశ్చర్యపోతున్నారు. అసలు విషయం ఏమిటంటే.. భూమి చాలా వేగంగా తిరుగుతోందట. అయితే భూమి తన చుట్టూ తాను తిరగడానికి 24 గంటల సమయం పడుతుంది.అలా ఈ 24 గంటల సమయాన్ని ఒక రోజుగా లెక్కిస్తారు. అయితే ప్రస్తుతం భూమి ఇప్పుడు ఉన్న వేగం కంటే మరింత వేగంగా తిరుగుతోందని తెలియజేస్తున్నారు. అంతేకాదు భూమి ఇలా ఫాస్ట్ గా తిరగడం వల్ల ఒక రోజులో కొంత వ్యవధి తగ్గుతోందని అంటున్నారు. మరి భూమి ఇలా వేగంగా తిరిగితే మానవాళికి ఏదైనా ముప్పు ఉందా ? శాస్త్రవేత్తలు ఎందుకు ఆందోళన పడుతున్నారు? అనేది ఇప్పుడు చూద్దాం. శాస్త్రవేత్తలు ఎప్పుడూ ఏదో ఒక ప్రయోగం చేస్తూనే ఉంటారు. అందులో భాగంగా తాజాగా భూమిపై చేసిన ఓ పరిశోధనలో షాకింగ్ విషయం తేలింది. అదేంటంటే భూమి వేగంగా తిరగడం వల్ల రోజులో కొంత టైమ్ కోతకు గురవుతుందని తెలియజేశారు. అయితే దీనివల్ల రోజుల సమయం తగ్గుతోందని చెబుతున్నారు.అంటే ఒక రోజులో 1.3 నుండి 1.5 మిల్లీసెకండ్లు తగ్గుతుందట.అయితే ఈ తక్కువ సమయం మన రోజువారి పనులకు ఎలాంటి ఆటంకం కలిగించకపోయినప్పటికీ సైంటిస్టులు మాత్రం ఈ పరిణామంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు..
ఎందుకంటే ఇది ఇలాగే కొనసాగితే ముందు ముందు అనర్థాలు తప్పవని అంటున్నారు. అయితే ఇంతకుముందు జూలై నెలలో 9, 22 ఈ రెండు రోజుల్లో కొన్ని మిల్లీ సెకండ్లు తగ్గాయి. ఇక తాజాగా ఈరోజు అనగా ఆగస్టు 5న కూడా మరొకసారి రోజులో 1:25 మిల్లీ సెకండ్లు తగ్గాయి. అయితే భూమి ఇంత ఫాస్ట్ గా తిరిగితే అటామిక్ క్లాక్, సోలార్ టైం మధ్య తేడా ఏర్పడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే భూమి వేగంగా తిరగడం గురించి అంతర్జాతీయంగా ఒక చర్చ నడుస్తోంది. 2035 నాటికి నెగిటివ్ లీప్ సెకండ్ ని తీసివేయాలని చర్చించుకుంటున్నారట. కానీ ఇలా తీసివేస్తే కొత్త సమస్యలు తలెత్తుతాయని సైంటిస్టులు అంటున్నారు. గతంలో అంటే 1972 సంవత్సరంలో 27 పాజిటివ్ లీప్ సెకండ్ లను యాడ్ చేశారు. దానివల్ల అప్పట్లో ఎన్నో ఇబ్బందులు తలెత్తాయి.
భూమి వేగం పెంచడానికి కారణం ఏంటంటే..చంద్రుడు భూమధ్యరేఖకు దూరంగా ఉన్నప్పుడు చంద్రుడి గురుత్వాకర్షణ ప్రభావం భూమిపై తక్కువగా ఉంటుంది.దీనివల్ల భూమి ఫాస్ట్ గా తిరుగుతుంది అని తెలుస్తోంది. అలా ఇప్పటికే జూలై 9,22వ తేదీలలో కూడా ఇలాగే జరిగింది. తాజాగా ఆగస్టు 5న కూడా జరిగే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ముఖ్యంగా ఈ రోజున 1.66 సెకండ్ల సమయం తగ్గనుంది అని సమాచారం.

# ఇదేం దరిద్రం.. భారతీయ ప్రతిభావంతురాలి బొట్టుపై ట్రోల్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాలో ఉన్నత పదవికి ఎన్నికైన భారతీయ మూలాలున్న ప్రతిభావంతురాలిని ప్రశంసించాల్సింది పోయి, ఆమె నుదుటిపై బొట్టు పెట్టుకుందని విమర్శించడం, ట్రోల్ చేయడం చాలా బాధాకరమైన విషయం. ఇది ఒక వ్యక్తి ప్రతిభను కాకుండా, ఆమె జాతి, రంగు, ఆచారాలను చూసి విమర్శించే సంకుచిత మనస్తత్వానికి నిదర్శనం.

**మధుర శ్రీధరన్ ప్రతిభకు ప్రతీక**
ఒహైయో రాష్ట్ర 12వ సోలిసిటర్ జనరల్‌గా నియమితులైన మధుర శ్రీధరన్, భారతీయ మూలాలున్నప్పటికీ అమెరికాలో పుట్టి పెరిగిన వ్యక్తి. ఆమె ఎంఐటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, ఎన్‌వైయు ) స్కూల్ ఆఫ్ లాలో జ్యూరిస్ డాక్టర్ పట్టా పొందారు. ఆమెకున్న అపారమైన ప్రతిభ, వాదన నైపుణ్యం ఆమెను ఈ ఉన్నత స్థాయికి చేర్చాయి.

**ట్రోల్స్‌కు కారణం బొట్టేనా?**
ఆమె నియామకం గురించి అటార్నీ జనరల్ కార్యాలయం అధికారికంగా ట్వీట్ చేసిన వెంటనే, సోషల్ మీడియాలో ట్రోల్స్ మొదలయ్యాయి. కొందరు "ఒక భారతీయురాలిని సొలిసిటర్ జనరల్‌గా ఎందుకు నియమించారు?" అని ప్రశ్నించగా, మరికొందరు "బొట్టు పెట్టుకుని వచ్చిందంటే ఇది అమెరికా దౌర్భాగ్యం" అని, "ఇండియన్స్ ఉద్యోగాలు ఎలా లాక్కుంటున్నారు!" అని తీవ్రంగా విమర్శించారు.

**అటార్నీ జనరల్ గట్టి సమాధానం**
ఈ విమర్శలపై ఒహైయో అటార్నీ జనరల్ డేవ్ యోస్ట్ స్పందిస్తూ, "ఆమె అమెరికాలోనే పుట్టింది. ఆమె అమెరికా పౌరురాలు. అద్భుతమైన న్యాయవాది. సోలిసిటర్ జనరల్ పదవికి ఆమె సరైన అభ్యర్థి. ఆమె బొట్టు, రంగు, పేరుతో మీకు ఇబ్బంది ఉంటే, సమస్య ఆమెలో కాదు... మీ ఆలోచనల్లోనే ఉంది!" అని ఘాటుగా బదులిచ్చారు.

**మనం గ్రహించాల్సిన విషయం**
ఈ సంఘటన అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా ఇంకా జాతి వివక్ష భావాలు ఉన్నాయని మరోసారి రుజువు చేసింది. నుదుటిపై బొట్టు పెట్టుకోవడం ఒక వ్యక్తిగత ఆచారం, సాంస్కృతిక చిహ్నం. దానిని ఆధారంగా చేసుకుని ఒక ప్రతిభావంతురాలిని విమర్శించడం మూర?పు చర్య. సమాజం అభివృద్ధి చెందాలంటే, వ్యక్తి సామర్థ్యం, అంకితభావం, ప్రతిభలే ముఖ్యమైనవి. బొట్టు పెట్టుకుందని, భారతీయురాలని ఒక ప్రతిభావంతురాలిని చిన్నచూపు చూడటం చాలా తప్పుడు ఆలోచన.మధుర శ్రీధరన్ తన ప్రతిభ, నైతికతతో ఈ పదవిని గౌరవిస్తూ, ట్రోల్స్‌కు తగిన సమాధానం చెప్పాలని ఆశిద్దాం.

# క్లౌడ్ బరెస్ట్ : ఉత్తరాఖండ్ లో వినాశనం..



**హైదరాబాద్ పెన్ పవర్:** ఉత్తరాఖండ్‌లో మరోసారి ప్రకృతి విలయం సంభవించింది. ఉత్తర కాశీ జిల్లాలో కుండపోత వర్షాల కారణంగా ఖీర్ గంగా నది ఉప్పొంగి ప్రవహించడంతో ధరాలీ, ఖీర్‌గడ్ గ్రామాలు పూర్తిగా నీట మునిగాయి. ఈ హఠాత్తుగా సంభవించిన ప్రకృతి విపత్తులో వందలాది ఇళ్లు, హొటళ్లు, దుకాణాలు ధ్వంసమయ్యాయి.

**భీకర వరదల్లో నలుగురు మృతి, 60 మంది గల్లంతు**
ఈ విపత్తులో ఇప్పటివరకు నలుగురు మృతి చెందినట్లు అధికారులు ధ్రువీకరించారు. 60 మందికి పైగా గల్లంతయ్యారు. దీంతో స్థానికుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఇంకా పలువురు మట్టి, శిథిలాల కింద చిక్కుకుపోయి ఉండొచ్చని భయపడుతున్నారు. నదిలో వచ్చిన అకస్మాత్తు వరదల వల్ల ఇళ్లు, రహదారులు కొట్టుకుపోయాయి. రోడ్లన్నీ మట్టితో, రాళ్లతో నిండిపోయాయి.

**సహాయక చర్యల్లో నిమగ్నమైన బృందాలు**
సమాచారం అందిన వెంటనే సైన్యం, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సహాయక చర్యలు మొదలుపెట్టాయి. వరదల్లో గల్లంతైన వారి కోసం గాలింపు ముమ్మరంగా కొనసాగుతోంది. పర్వతాల నుంచి సునామీలా దూసుకొచ్చిన వరద నీరు ప్రజల్లో భయాందోళనలు సృష్టించింది. ప్రస్తుతం సహాయక చర్యలు వేగంగా జరుగుతున్నాయి.

**సీఎం ధామి స్పందన, కేంద్రం భరోసా**
ఈ విషాద ఘటనపై ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పరిస్థితిని సమీక్షిస్తూ సీనియర్ అధికారులతో నిరంతరం మాట్లాడుతున్నారు. "ధరాలీలో జరిగిన నష్టం చూసి చాలా బాధ కలిగింది. బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాం. వారికి అన్ని విధాలా సహాయం అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకుంటాం" అని ఆయన అన్నారు.
కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి ధామికి ఫోన్ చేసి వరద పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రం తరఫున అన్ని రకాల సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఈ ఘటనపై స్పందించారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. "రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో సహాయక చర్యలు జరుగుతున్నాయి. ప్రజల ప్రాణాలను కాపాడటమే మా మొదటి ప్రాధాన్యత. కేంద్రం అన్ని విధాలా రాష్ట్రానికి అండగా ఉంటుంది" అని ట్వీట్ చేశారు.
ఇదిలా ఉండగా, వాతావరణ శాఖ మరో కొన్ని రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నదుల వద్దకు వెళ్లకూడదని అధికారులు సూచించారు.

## అప్పుడు గాటింగ్.. ఇప్పుడు బ్రూక్: టాప్ ఇన్నింగ్స్ ఆడి ఇంగ్లాండ్ జట్టును ముంచేశారు



**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ లో ఒక చెత్త షాట్ మ్యాచ్ పై ఎంత తీవ్ర ప్రభావం చూపుతుందనే విషయం చాలా సార్లు రుజువైంది. అప్పటివరకు క్లిష్ట పరిస్థితిలో ఒత్తిడి తట్టుకొని ఆడి జట్టును విజయతీరాలకు తెచ్చిన ఆటగాళ్లు తన తప్పుడు షాట్ సెలక్షన్ తో ఔటయ్యి జట్టు ఓటమికి కారణమవుతారు. టీమిండియాతో ఓవల్ వేదికగా జరిగిన ఐదో టెస్టులో ఇంగ్లాండ్ ఓటమిని ఎవరూ ఊహించి ఉండరు. జట్టు అప్పటికే మూడు వికెట్ల నష్టానికి 301 పరుగులు చేసి విజయం దిశగా దూసుకెళ్తుంది. మరో 73 పరుగులు చేస్తే ఇంగ్లాండ్ మ్యాచ్ గెలవడంతో పాటు సిరీస్ కైవసం చేసుకుంటుంది. హ్యారీ బ్రూక్ (111) సెంచరీతో మ్యాచ్ ను పూర్తిగా ఇంగ్లాండ్ వైపుకు మళ్ళించాడు. రూట్ తో కలిసి నాలుగో వికెట్ కు 195 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి భారత జట్టుకు చెమటలు పట్టించాడు. సిరాజ్ క్యాచ్ మిస్ చేయడంతో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న ఈ ఇంగ్లాండ్ యువ బ్యాటర్ వన్డే ఫార్మాట్ తరహాలో ఆడుతూ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. బ్రూక్ ఆట తీరుకు భారత ఆటగాళ్ల వద్ద సమాధానం లేకుండా పోయింది. అయితే బ్రూక్ ఆడిన చెత్త షాట్ కారణంగా ఇంగ్లాండ్ పతనం ప్రారంభమైంది. ఆకాష్ దీప్ బౌలింగ్ లో ముందుకు వచ్చి ఒక లూజ్ షాట్ ఆడితే టైమింగ్ కుదరక కవర్స్ లో క్యాచ్ వచ్చింది. బ్రూక్ వికెట్ భారత జట్టుకు ఫుల్ జోష్ ఇచ్చింది. టీ విరామం తర్వాత బెతేల్, రూట్ వికెట్లు పడ్డాయి. చివరి రోజు సిరాజ్ విజృంభించి ఇంగ్లాండ్ పరాజయానికి కారణమయ్యాడు. బ్రూక్ మంచి ఇన్నింగ్స్ ఆడినా అతని చెత్త షాట్ జట్టు ఓటమికి కారణమైంది. 1987 వన్డే వరల్డ్ కప్ ఫైనల్లోనూ ఇంగ్లాండ్ జట్టుకు ఇదే సీన్ జరిగింది. ఫైనల్లో మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 253 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ ఛేజింగ్ లో ఆరంభంలోనే ఓపెనర్ టిమ్ రాబిన్సన్ వికెట్ కోల్పోయినప్పటికీ.. గ్రాహం గూచ్ (35), బిల్ అథే (58) ఇంగ్లాండ్‌ను నిలబెట్టారు. కెప్టెన్ గాటింగ్ 45 బంతుల్లోనే 41 పరుగులు చేయడంతో ఇంగ్లాండ్ 2 వికెట్లను 135 పరుగులు చేసి పటిష్ట స్థితిలో నిలిచింది. విజయం దిశగా వెళ్తున్న ఇంగ్లాండ్ ను కెప్టెన్ గాటింగ్ ఒక అనవసర షాట్ తో జట్టు ఓటమికి కారణమయ్యాడు. అలెన్ బోర్డర్ లాంటి పార్ట్ టైం బౌలర్ వేసిన బంతిని రివర్స్ స్వీప్ ఆడే ప్రయత్నంలో ఔటయ్యాడు. వాస్తవానికి ఆ సమయంలో గాటింగ్ ఆ షాట్ ఆడాల్సిన అవసరం లేదు. కానీ చెత్త షాట్ ఆడి వికెట్ పోగొట్టుకోవడంతో మ్యాచ్ లో ఆస్ట్రేలియా విజయం సాధించింది. తాజాగా ఇండియాపై బ్రూక్ చెత్త షాట్ ఇంగ్లాండ్ ఓటమికి కారమైంది.

## ఈ లాజిక్ ఎక్కడ పట్టారు బాస్.. వింత సెంటిమెంట్‌తో బుమ్రాపై నెటిజన్స్ ట్రోలింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాపై ఇంగ్లాండ్ టూర్ కు ముందు భారీ అంచనాలు ఉన్నాయి. ఇంగ్లాండ్ తో జరగబోయే ఐదు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ కు బుమ్రా కీలకమని.. ఈ పేసర్ ను కాపాడుకుంటూ వచ్చారు. అంచనాలకు తగ్గట్టుగానే బుమ్రా తాను ఆడిన మూడు టెస్టుల్లో రాణించాడు. మాంచెస్టర్ వేదికగా జరిగిన నాలుగో టెస్టు పక్కనపెడితే లీడ్స్, లార్డ్స్ లో 5 వికెట్ల ఘనతను అందుకున్నాడు. ఇంతవరకు బాగానే ఉన్నా ఇప్పుడు ఒక కొత్త సెంటిమెంట్ టీమిండియా ఫ్యాన్స్ ను వింత అనుభవానికి గురి చేస్తోంది. అదేంటో కాదు బుమ్రా భారత టెస్ట్ జట్టులో ఉంటే మన జట్టు గెలవడం కంటే ఎక్కువగా ఓడిపోతుంది.

అదే సమయంలో బుమ్రా ఆడని మ్యాచ్ ల్లో భారత జట్టు టెస్టుల్లో అద్భుత విజయాలను సాధిస్తూ వచ్చింది. తాజాగా ఇంగ్లాండ్ తో ముగిసిన 5 మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ను ఇండియా 2-2 తో సిరీస్ సమం చేసింది. ఇండియా గెలిచిన రెండు టెస్టుల్లో బుమ్రా లేకపోవడం విశేషం. బుమ్రా ఆడిన మూడు టెస్టుల్లో రెండు మ్యాచ్ ల్లో ఓడిపోగా.. ఒక మ్యాచ్ డ్రా అయింది. అంతకముందు బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో బుమ్రా 5 టెస్ట్ మ్యాచ్ లాడితే టీమిండియా కేవలం ఒక మ్యాచ్ లోనే గెలిచింది. దీంతో ఇప్పుడు బుమ్రాపై సరదాగా సోషల్ మీడియాలో ట్రోలింగ్ సాగుతోంది. బుమ్రా తప్పుకొని టీమిండియాకు విజయాన్ని అందించాడని ఒక నెటిజన్ కామెంట్ చేశాడు. కొంతమందైతే టీమిండియా టెస్ట్ మ్యాచ్ లు గెలవాలంటే బుమ్రాకు మరింత రెస్ట్ అవసరమని కామెంట్ చేస్తున్నారు. బుమ్రా టీమిండియా తరపున ఇప్పటివరకు 48 టెస్టులు ఆడాడు. వీటిలో భారత్ 20 మ్యాచ్ ల్లో గెలిస్తే మరో 23 మ్యాచ్ ల్లో ఓడిపోయింది. 2018లో బుమ్రా అరంగేట్రం చేసినప్పటి నుండి బుమ్రా ఆడని 28 టెస్ట్ మ్యాచ్‌ల్లో ఇండియా ఐదు మాత్రమే ఓడిపోయింది. 20 మ్యాచ్‌ల్లో విజయం సాధించగా.. మరో మూడు డ్రాగా ముగిశాయి. ఇప్పటికే ఆడిన మూడు టెస్టుల్లో బుమ్రా.. ఎడ్జ్ బాస్టన్, ఓవల్ టెస్ట్ లకు దూరమయ్యాడు. తొలి టెస్టుతో పాటు లార్డ్స్, మాంచెస్టర్ టెస్టులో బరిలోకి దిగాడు. 31 ఏళ్ల బుమ్రా మొదటి మూడు టెస్టలలో 119.4 ఓవర్లు బౌలింగ్ చేసి 14 వికెట్లు పడగొట్టాడు. హెడింగ్లీ, లార్డ్స్‌లో ఐదు వికెట్ల హాల్ ఉన్నాయి. లీడ్స్‌లో 43.4 ఓవర్లు బౌలింగ్ చేసి ఐదు వికెట్లు తీశాడు. లార్డ్స్‌లో మూడో టెస్టుకు తిరిగి వచ్చిన బుమ్రా 43 ఓవర్లు బౌలింగ్ చేసి ఏడు వికెట్లు పడగొట్టాడు. మాంచెస్టర్ టెస్టులో 33 ఓవర్లలో 112 పరుగులు సమర్పించుకున్న బుమ్రా రెండు వికెట్లు తీసుకున్నాడు.

## కెప్టెన్‌గా రషీద్ ఖాన్.. ఆసియా కప్‌కు ఆఫ్ఘనిస్తాన్ ప్రిలిమినరీ స్క్వాడ్ ప్రకటన..

**హైదరాబాద్ పెన్ పవర్:** యూఏఈ వేదికగా వచ్చే నెలలో జరగనున్న ఆసియా కప్ కోసం ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు తమ ప్రిలిమినరీ స్క్వాడ్ ను ప్రకటించింది. 22 మందితో కూడిన ప్రాబబుల్స్ ను మంగళవారం (ఆగస్టు 5) ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు రిలీజ్ చేసింది. ఈ జట్టుకు రషీద్ ఖాన్ కెప్టెన్సీ చేయనున్నాడు. ఈ కాంటినెంటల్ ఈవెంట్ సెప్టెంబర్ 9 నుండి 26 వరకు జరగనుంది. ఆసియా కప్ కంటే ముందు ఆఫ్ఘనిస్తాన్ షార్జా వేదికగా పాకిస్థాన్, యూఏఈ లతో ట్రై సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్ ఆసియా కప్ కు సన్నాహకంగా ఉపయోగపడుతుంది.

స్క్వాడ్ లో ఎంపికైన ఆటగాళ్లు ట్రై-సిరీస్, ఆసియా కప్‌కు ముందు రెండు వారాల ప్రాక్టీస్ ప్రారంభించనున్నారు. స్క్వాడ్ లో ఎంపికైన ఆటగాళ్లలో ఎక్కువ మంది ఇటీవల ఆఫ్ఘనిస్తాన్‌లో జరిగిన డొమెస్టిక్ టీ20 టోర్నీ ష్పగీజా క్రికెట్ లీగ్‌లో ఆడిన వారే ఉండడం విశేషం. ఆగస్టు 29 నుండి సెప్టెంబర్ 7 వరకు జరిగే టీ20 ట్రై-సిరీస్‌లో ఆఫ్ఘనిస్తాన్, యూఏఈ, పాకిస్తాన్‌లతో ఆడనుంది. ఈ మూడు జట్లు ఆసియా కప్ లో కూడా ఆడుతుండడం వీరికి ప్రాక్టీస్ గా ఉపయోగపడనుంది. ఆసియా కప్ లో ఆఫ్ఘనిస్తాన్ గ్రూప్ బి లో ఉంది. బంగ్లాదేశ్, శ్రీలంక, యూఏఈ జట్లు కూడా ఇదే గ్రూప్ లో ఉన్నాయి. ఆసియా కప్‌లో ఆఫ్ఘనిస్తాన్ తమ తొలి మ్యాచ్‌ను సెప్టెంబర్ 9న హాంకాంగ్‌తో ఆడనుంది. సెప్టెంబర్ 16, 18 తేదీల్లో వరుసగా బంగ్లాదేశ్.. శ్రీలంకతో తలపడనుంది. ఈ టోర్నీ లీగ్ మ్యాచ్ లన్నీ అబుదాబిలో జరగనున్నాయి.



**ఆసియా కప్ కు 22 మంది ఆఫ్ఘనిస్తాన్ ప్రిలిమినరీ స్క్వాడ్:**

రహ్మానుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), సెడిఖుల్లా అటల్, వఫివుల్లా తారఖిల్, ఇబ్రహీం జద్రాన్, దర్విష్ రసూలీ, మహ్మద్ ఇషాక్, రషీద్ ఖాన్ (కెప్టెన్), మహ్మద్ నబీ, షర్మాత్ నబీ, షర్మాత్ నబీ, నంగ్యాల్ ఖుద్రోతి ఒమర్జాయ్, గుల్బాదిన్ నైబ్, ముజీబ్ జద్రాన్, అల్లా గజన్‌ఫర్, నూర్ అహ్మద్, ఫజల్ హక్ ఫరూఖీ, నవీన్ ఉల్ హక్, ఫరీద్ మాలిక్, సలీమ్ సఫీ, అబ్దుల్లా అహ్మద్‌జాయ్, బషీర్ అహ్మద్



నిధి అగర్వాల్ యొక్క చీర శైలి కొత్త జాతి ఫ్యాషన్ లక్ష్యాలను నిర్దేశిస్తుంది

# ఆ మూడు రిలీజ్లకు అదే మాట!



ఇటీవలే పాన్ ఇండియాలో రిలీజ్ అయిన %-%మహావతార్ నరసింహ%-% మంచి విజయం సాధించిన సంగతి తెలిసిందే. తెలుగు ప్రేక్షకులు ఈ చిత్రానికి బ్రహ్మరథం పడుతున్నారు. రిలీజ్ అయి పది రోజులు గడిచినా ఇప్పటికీ థియేటర్లు హౌస్ ఫుల్ అవుతున్నాయి. ఇప్పటికే చిత్రం వంద కోట్ల క్లబ్ లో కూడా చేరిపోయింది. మహాభారతం, భాగవతం కాన్సెప్ట్ ఆధారంగా యానిమేషన్ పాత్రలతో ప్రేక్షకులకు కనెక్ట్ చేయడంలో మేకర్స్ వంద శాతం సక్సెస్ అయ్యారు. సాధారణంగా ఇలాంటి కాన్సెప్ట్ ని యానిమేషన్ గా రూపొందించి రిలీజ్ చేయడం అన్నది పెద్ద సాహసమే.

**బోర్ కొట్టని కంటెంట్**

ఎందుకంటే ఇలాంటి చిత్రాలకు ఆదరణ తక్కువగా ఉంటంది. చిన్న పిల్లలే ఇలాంటి చిత్రాలకు కనెక్ట్ అవుతారు ? అన్న మాటను మహావతార్ నరసింహ బ్రేక్ చేసింది. కంటెంట్ ఉంటే ? కటౌట్ తో పనిలేదు అన్నట్లు అన్ని వర్గాల ప్రేక్షకులకు ఈ చిత్రం కనెక్ట్ అయింది. హిందు ధర్మం కాన్సెప్ట్ ను ఎంతో తెలివిగా కనెక్ట్ చేసారు. తీసుకున్న పాత్రల్లో గొప్ప ఎమోఎషన్ పండించడంతోనే ఇది సాధ్యమైంది. రెండు న్నర గంటల పాటు ఎలాంటి బోర్ ఫీల్ అవ్వకుండా కథాంశాన్ని ఎంతో ఎంగేజింగ్ గా చెప్పారు.

**ఆ సినిమాపైనా అదే అంచనా**

తెలుగు ప్రేక్షకుల నోట ఇప్పుడు మహావతార్ మాటే వినిపిస్తుంది. సనాతన ధర్మం పరిరక్షణ కొరకై అంటూ జనాలంతా మాట్లాడుకుంటున్నారు. మరి ఇదే మాట అప్ కమింగ్ రిలీజ్ విషయంలోనూ బలంగా విని పించే అవకాశం ఉంది. ఇంతకీ ఏంటా సినిమాలంటే? వివరాల్లోకి వెళ్లాల్సిందే. నటసింహ బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను - అఖండ - కు సీక్వెల్గా - అఖండ 2%-% తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా కూడా హిందు ధర్మం శివుడి కాన్సెప్ట్ ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. శివుడి పాత్ర స్ఫూర్తితోనే బోయపాటి బాలయ్య పాత్రను తనదైన ట్రీట్ మెంట్ తో తీర్చి దిద్దుతున్నాడు.

**ఉత్తరాదిన బాలయ్య మార్క్**

ప్రత్యేకించి ఈ సినిమాపై ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ అంచనాలున్నాయి. %-%అఖండ%-%తోనే బాలయ్య నార్త్ కి కనెక్ట్ అయిపోయారు. ఈ నేపథ్యంలో అక్కడ అంచనాలను దృష్టిలో పెట్టుకుని పాత్రను ఆద్యంతం ఆసక్తికరంగా మలుస్తున్నారు. మరోవైపు కన్నడ నటుడు రిషబ్ శెట్టి స్వీయా దర్శకత్వంలో తెరకెక్కిస్తోన్న %-%కాంతార 2%-%పైనా అంచనాలు అదే స్థాయిలో ఉన్నాయి. హిందు దేవతల కాన్సెప్ట్ ఆధారంగానే తెర కెక్కుతోంది. దైవ నృత్యం - భూత కోలం , స్థానిక దేవతల గురించిన కాన్సెప్ట్ ఇది. వాటికి సంబంధించి వివిధ ఆహార్యాల్లో రిషబ్ శెట్టి కనిపించనున్నాడు. దీంతో ఆ పాత్రలు ఎలా ఉంటాయి? అన్న దానిపై సర్వత్రా చర్చ నడుస్తోంది.

**తెలిసిన రామాయణం చెప్పేదెలా!**

అలాగే బాలీవుడ్ లో నితిష్ తివారీ ప్రతిష్ఠాత్మకంగా %-%రామాయణ్%-% తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. రామా యణం అంటే ప్రజలందరికీ తెలిసిన కథ. దీంతో ఆ కథను నితీష్ ఎలా ఎగ్జిక్యూట్ చేస్తున్నాడు? రామా యణంలో పాత్రలను ఎలా ఆవిష్కరించబోతున్నారు? అన్నదే హాట్ టాపిక్. ఈ జనరేషన్ యువతకు రామాయణాన్ని ఎలా కనెక్ట్ చేస్తారు? అన్నది మరో ఇంట్రెస్టింగ్ అంశం. అలా ఈ మూడు చిత్రాలు హిందు ధ ర్మం తో ముడిపడిన చిత్రాలగా నెట్టింట వైరల్ అవుతున్నాయి. సోషల్ మీడియాలో జనాలు వాటి గురిం చి చర్చించడం ఎక్కువైంది. ఈ మూడు చిత్రాలు 2025-26 లో రిలీజ్ కానున్నాయి.



రవితేజ సినిమాలో ఆశికా రంగనాథ్ కీలక పాత్ర పోషిస్తున్నారు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com